



విపత్తులోనూ.. విజయ ఢంకా

- చెక్కు చెదరని ప్రకృతి వ్యవసాయ పంటలు
- ఎరువులు వాడక పోవటంతో వెంటనే ఇంకిపోయిన నీరు
- వేర్లు పొడవుగా పెరగడంతో చావు తప్పించుకున్న మొక్కలు
- వెంటనే తేరుకున్న వరి, పత్తి, పసుపు పొలాలు
- శాస్త్రవేత్తల పరిశీలనలో విస్తుపోయే వాస్తవాలు



ప్రకృతి వ్యవసాయ పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 16 : ప్రకృతి వ్యవసాయ రంగం గుంటూరు జిల్లాలో కొత్త రికార్డును సృష్టించింది. ఈ నెల ఆరంభంలో సంభవించిన విపత్తును ప్రకృతి వ్యవసాయం పూర్తిగా జయించింది. ఈ విషయాన్ని వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రకటించారు. వరదలు తర్వాత వ్యవసాయ క్షేత్రాలు సందర్శించిన శాస్త్రవేత్తలు ఆసక్తికరమైన సంగతులు తెలిపారు. సంప్రదాయ పద్ధతుల్లో సాగు చేసిన వరి, పత్తి, పసుపు పొలాలు వారం రోజుల నీటి మునక తర్వాత కూడా పచ్చగా కళకళ లాడుతూ కనిపించాయి.మొక్కలు ఒకటి, రెండు రోజులకే పూర్తిగా తిప్పుకొని యధాస్థితికి చేరాయి. ప్రకృతి వ్యవసాయ పద్ధతి ఆచరించిన పొలాల్లో ఒక్క మొక్క కూడా వరద తాకిడి వల్ల చనిపోలేదు.పక్కనే ఉన్న రసాయన ఎరువులు, పురుగు మందులు వాడిన పొలాల్లో రోజుల తరబడి నీళ్ళు నిలబడి ఉండగా, ఈ పొలాల్లో మాత్రం పడ్డ నీరు వెంటనే ఇంకిపోయింది. శాస్త్రీయంగా సాగిన సర్వేలో శాస్త్రవేత్తలు పరిశీలించిన అనేక అంశాలు ఆసక్తిని కలిగించేవిగా ఉన్నాయి.

పచ్చిరొట్టతో తప్పిన ప్రమాదం

ప్రధాన పంట కంటే ముందు వేసిన 30 రకాల పచ్చిరొట్ట వల్ల ప్రమాదం నుండి మొక్కలు తప్పించుకున్నాయి. కేవలం పచ్చిరొట్ట మాత్రమే వాడిన పొలాల్లో వరద నీరు భూమిలోకి ఇంకిపోవటానికి 25 నిమిషాల సమయం పట్టింది. రసాయన ఎరువులు వాడిన పొలాల్లో నీరు ఇంకేందుకు 1.30 గంటల సమయం పట్టినట్లు తేలింది. పచ్చిరొట్ట వాడిన ప్రకృతి వ్యవసాయ పొలాల్లో మొక్కల వేర్లు కూడా పొడవుగా పెరిగాయి.వేర్ల చుట్టూ దుబ్బు ఎక్కువగా కట్టటం, మట్టి ఎక్కువ చేరివుండటం వల్ల వారం రోజుల ముంపు తర్వాత కూడా మొక్కలు చనిపోలేదు. శాస్త్రవేత్తలు రసాయనిక పొలాల్లోని మొక్కలకు పెరిగిన వేర్లను కూడా కొలత వేయగా అవి పీలగా పెరిగినట్లు గుర్తించారు. దుబ్బు పెద్దగా లేకపోవడం,భూమి లోపల మొక్క చుట్టు మట్టి పెద్దగా లేకపోవడం వల్ల గాలికి, వరదకు పంట పడిపోయినట్లు గమనించారు. వారం రోజులు నీటిలో మునిగినా ప్రకృతి వ్యవసాయ పొలాల్లోని పంటలకు చీడ, పీడ లు సోకలేదు. భూమిలో మిత్ర పురుగుల నిష్పత్తి ఎక్కువగా ఉన్నట్లు తేలింది.

కోడి గుడ్డు, నిమ్మరసం మహా ఔషధం

వరద నీరు పోయిన తర్వాత ప్రకృతి వ్యవసాయ పంటలకు రైతులు కోడి గుడ్డు, నిమ్మరసం కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేశారు. అదే మహా ఔషధం లా పనిచేసి మొక్క మరింత బలంగా మారింది. 250 మిల్లీ లీటర్ల కోడి గుడ్డు, నిమ్మరసం ద్రావణాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయటం వల్ల మొక్కకు మేలు జరిగినట్లు శాస్త్రవేత్తలు గమనించారు.ఈ ద్రావణం పిచికారీకి ఎకరాకు కేవలం రూ. 100 మాత్రమే ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. రసాయన పొలాల్లో మాత్రం రైతులు వరద తర్వాత వేలాది రూపాయలు వెచ్చించి బలం మందులు వేశారు. అయినా అవి ఇంకా తిప్పుకోలేదు.

దెబ్బతిన్న పసుపు

వరద వల్ల పసుపు పంట బాగా దెబ్బ తిన్నట్లు తేలింది. చాలా చోట్ల మొక్కలు పూర్తిగా పసుపు బారి పోయి ఎండిపోయాయి. ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో మాత్రం పసుపు పంట నిక్షేపంగా ఉంది. ఒక్క మొక్క కూడా పసుపు బారలేదు. అలాగే వరి దుబ్బులు కూడా బలంగా ఉండటం వల్ల ఎక్కడా పసుపు బారిన దాఖలాలు లేవని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

రెండు బృందాలతో సర్వే

వరద తర్వాత పంట పొలాలు పరిశీలించేందుకు రైతు సాధికార సంస్థ రెండు బృందాలను జిల్లాకు పంపింది. కిరణ్మయి, హిమ బిందు, బాషా, గురవయ్య, పధ్వీరాజ్ ఈ బృందాల్లో వున్నారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి నేతృత్వంలో ఈ బృందాలు లాం, వల్లభాపురం, ముట్లూరు, కొల్లిపర, అత్తోట, హనుమాన్‌పాలెం, పెదకొండూరు గ్రామాల్లో పర్యటించి పంట పొలాలను పరిశీలించి శాస్త్రీయ సర్వే నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ రైతులు, రసాయనిక రైతులను కలిసి పొలాల్లో ఉన్న పరిస్థితిని అత్యాధునిక టెక్నాలజీ తో అంచనా వేశారు. రెండు పొలాల్లో ఉన్న తేడాను రైతులకు ప్రత్యక్షంగా చూపించారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లను ఇందులో భాగస్వామ్యం చేశారు.

ప్రకృతి పంటలు విపత్తును జయించాయి..

జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ పంటలు విపత్తును జయించాయి. వారం రోజులు నీటిలో ఉన్నప్పటికీ ఒక్క మొక్క చనిపోలేదు. జిల్లా లో 10 వేల మంది కి పైగా రైతులు సాగు చేసిన పత్తి, వరి, పసుపు పంటలు అధిక వర్షపాతాన్ని తట్టుకొని మనుగడ సాధించాయి. ఇది ప్రకృతి రైతుల విజయం అని చెప్పవచ్చు.

- రాజకుమారి, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్

ఐదేళ్ల నిర్లక్ష్యం.. సాగునీటి వ్యవస్థ నిర్వీర్యం



- కంప చెట్లు పెరిగి అధ్వానంగా ఉన్న గోవిందాపురం కాలువ

- అస్తవ్యస్తంగా సాగునీటి కాలువలు
- అసలు పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- దిద్దుబాటు దారిలో కూటమి ప్రభుత్వం
- సాగునీటి సంఘాల ఎన్నికలకు కసరత్తు

రెండు నెలల్లో ఎన్నికల నిర్వహణకు సమాయత్తం

వైసీపీ ప్రభుత్వం సాగునీటి వ్యవస్థలను నిర్వీర్యం చేసింది. ఐదేళ్ల పాలనలో కాలువల నిర్వహణను గాలికొదిలేసింది. కాల్వల నిర్వహణకు నిధులు నిలిపివేసి వాటిని అధ్వానంగా మార్చేసింది. జల వనరుల శాఖలో ఖాళీలనూ భర్తీ చేయలేదు. సిబ్బంది కొరత నీటి నిర్వహణలో సమస్యలు తలెత్తుతున్నాయి. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సాగునీటి రంగం బలోపేతానికి చర్యలు చేపట్టింది. సాగునీటి వ్యవస్థ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. నీటి పారుదల వ్యవస్థలో పర్యవేక్షణలో కీలకమైన సాగు నీటి ఎన్నికల నిర్వహణకు పచ్చ జెండా ఊపింది. ఎన్నికల నిర్వహణకు కసరత్తు ప్రారంభమైంది. రెండు నెలల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయిం చినప్పటికీ భారీ వర్షాలు.. వరదలతో ఈ ప్రక్రియకు కొంత మేర అవాంతరం ఏర్పడింది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సాగునీటి వినియోగదారుల సంఘాలు సాగునీటి వ్యవస్థలో కీలకమైనవి. నాగార్జునసాగర్ కుడికాలువ ప్రాజెక్టు కమిటీ పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో 259 నీటి సంఘాలు, 30 డిస్ట్రిబూటరీ కమిటీలు ఉన్నాయి. వీటికి ఎన్నికల నిర్వహణను వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. దీంతో సాగు నీటి కాలువల నిర్వహణలో రైతుల పాత్రను తొలగించినట్లయింది. సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తే సాగు నీటి సరఫరా.. కాలువ మరమ్మతుల్లో అవి కీలక పాత్ర పోషిస్తాయి. ఈ దిశగా ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగానే నీటి సంఘాలకు ఎన్నికలు జరుగనున్నాయి. సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో రైతులు అవస్థలు పడ్డారు. 2015లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. వీటి పదవీ కాలం ముగిసినా వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించ లేదు. దీంతో జలవనరుల నిర్వహణ గాడి తప్పింది. కాలువలు పూడికతో నిండి అధ్వానంగా తయారయ్యాయి.

నీటి తీరువా నిధులు దారి మళ్లింపు..

సాగర్ కాలువల మరమ్మతులకు ఇవ్వాల్సిన నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించుకుంది. రైతులు ఏటా నీటి తీరువా చెల్లిస్తారు. నీటి శిస్తు ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీలకు ఐదు శాతం కేటాయిస్తారు. 80 శాతం నిధులను మైనర్ ఇరిగేషన్, మేజర్ ఇరిగేషన్‌లకు కేటాయించాలి. సాగు నీటి సంఘాల ఎన్నికలు జరగకపోవడంతో సంబంధిత అధికారులకే నీటి సంఘాల బాధ్యతలను అప్పగించారు. ప్రాజెక్టు కమిటీ బాధ్యతలను ఎస్సీకి, డిస్ట్రిబ్యూటరీ కమిటీల బాధ్యతలను ఈఈలకు, నీటి సంఘాల బాధ్యతలను డీఈ, జెఈలకు అప్పగించారు. నీటి సంఘాలు లేకపోవడంతో కాలువల పనుల పర్యవేక్షణను అధికారులకు అప్పగించారు. నీటి తీరువాకు సంబంధించిన నిధులను కాడా సాగునీటి కమిటీల వారీగా కేటాయిస్తుంది. ఈ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. వసూలైన నీటి తీరువాలో 80 శాతం నిధులను నీటి సంఘాలకు కేటాయించాలి. ఈ నిధుల్లో సగం మేజర్, సగం మైనర్ ఇరిగేషన్‌లకు కేటాయించాలి. 10 శాతం పరిపాలనకు వినియోగిస్తారు. 15 శాతం నిధులను డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 14 శాతం నిధులను ప్రాజెక్టు కమిటీకి కేటాయించాలి. ఇలా కేటాయింపులు ఐదేళ్లుగా జరుగలేదు. నీటి తీరువా నిధులు కాడాకు చేరుతాయి. అక్కడి నుంచి నీటి సంఘాలకు దామాషా ప్రకారం కాడా నిధులు కేటాయించాలి. సదరు నిధులు కాడాకు చేరకపోవడంతో కాలువల మరమ్మతులు చేపట్టలేదు. ఏటా సాగర్ ఆయకట్టు పరిధిలో నీటి తీరువా ఏటా రూ 20 నుంచి 21 కోట్లు వస్తుందని అంచనా. రైతులు చెల్లించే నీటి తీరువాపై కాలువల మరమ్మతులు ఆధారపడి ఉంటాయి. ఈ నిధులను కాడాకు చేరకుండా వైసీపీ ప్రభుత్వం దారిమళ్లించి కాలువల మర మ్మతులకు మొండిచేయి చూపింది. గత ఐదేళ్లగా నీటి తీరువా నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోతుండటంతో కాలువలు మరమ్మతులు నోచుకోక అధ్వానంగా మారాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సాగునీటి సంఘాల ప్రాధాన్యాన్ని గుర్తించింది. ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు ఆదేశించింది. తొమ్మిదేళ్ల తర్వాత సదరు సంఘాలకు ఎన్నికలు జరగనుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నరసరావుపేటలోని ప్రాజెక్టు కమిటీ, డీసీ కార్యాలయాలు

సిబ్బంది కొరత..

సాగు నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి రైతులకు ఓటు హక్కు కల్పిస్తారు. భూమి, పట్టాదారు పాసు పుస్తకం ఉంటే రైతులను ఓటర్లుగా గుర్తిస్తారు. సా గునీరు సరఫరా చేసే ప్రాంతాల్లో భూములు ఉన్న రైతుల్ని ఓటర్లుగా గుర్తిస్తారు. సర్వే నెంబర్లు ఆధారంగా సాగునీటి సంఘాల వారీగా ఓటర్లను కేటాయిస్తారు. ఈ ప్రక్రియలో రెవెన్యూ శాఖ కీలక పాత్ర పోషిస్తుంది. రెవెన్యూ, జలవనరుల శాఖలు ఎన్నికల బాధ్యతలు నిర్వహిస్తారు. ప్ర భుత్వ ఉత్తర్వు మేరకు సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధిం చిన ప్రాథమిక వివరాలను ప్రభుత్వానికి అందించినట్లు సదరు అధికారులు తెలిపారు. అ యితే ఎన్నికల నిర్వ హణకు సిబ్బంది కొరత నెలకొంది. జలవనరుల శాఖలో భారీగానే ఖాళీలు ఉన్నాయి. వీటిని భర్తీ చేయకుంటే ఎన్నికల నిర్వ హణకు ఇబ్బందులు ఏర్పడతాయన్న వాదన సదరు శాఖలో వినిపిస్తోంది.



- బాపట్ల మున్సిపాలిటీలో ఏం జరుగుతోంది..?
- బాధితులకు డబ్బులు వెనక్కి ఇప్పించామని ఇటీవల ఎమ్మెల్యే ప్రకటన
- పనులు చక్కబెడతామని మధ్యవర్తుల అవినీతి దందా
- అవినీతిపై గతంలోనే పలు ఆరోపణలు
- చట్ట పరమైన చర్యలకు వెనకడుగు ఎందుకు..?

లంచం తీసుకున్నదెవరు.. ఇచ్చిందెవరు

బాపట్ల, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): కొంతమంది అధికారులు అవినీతికి పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, కూటమి ప్రభుత్వ పాలనలో అలాంటి వాటిని సహించేది లేదని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ ఆగస్టు చివరి వారంలో విలేకరుల సమావేశం పెట్టి మరీ వెల్లడించారు. సీన్ కట్ చేస్తే ఇటీవల బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ఎవరైతే మధ్యవర్తులు ఉండి లంచాలు తీసుకున్నారో వారిని పిలిపించి ఆ డబ్బులు వెనక్కి ఇప్పించడం కూడా జరిగింది. అది అధికారుల వల్ల జరిగిందని నేను అనుకోవడం లేదు. బంధువుల పేరుతో ఇదంతా చేశారు. అవినీతిలేని మంచి పాలన అందించడమే ప్రథమ లక్ష్యంగా ముందుకెళుతున్నాం. రాబోయే రోజుల్లో ఇటువంటివి జరగకుండా చూస్తానని మీకు హామీ ఇస్తున్నా" అని అన్నారు. ఇదంతా కూడా పరోక్షంగా బాపట్ల మున్సిపాలిటీకి సంబంధించిన వ్యవహారమే. దీంతో అవినీతి జరిగినట్లు సాక్షాత్తు ఎమ్మెల్యేనే ఆ ప్రకటన ద్వారా నిర్ధారణ చేసినట్లయింది. అవినీతి ఆరోపణలు రాగానే అందుకు సంబంధించి విచారణ చేపట్టడం, నిజమేనని తేల్చడం, డబ్బులు తిరిగి వెనక్కి ఇప్పించడం ఇవన్నీ కూడా ఎమ్మెల్యే నరేంద్రవర్మ ప్రతిష్ట పెంచేవే. అయితే ఇక్కడే ఓ ప్రశ్న తలెత్తుతోంది. దాసుడి తప్పు దండంతో సరి అన్నట్లుగా లంచం తీసుకుని, తీరా బయటకు వచ్చాక వాటిని తిరిగి ఇచ్చేస్తే తప్పు ఒప్పవుతుందా? లేక చట్ట పరంగా వారిపై కేసు నమోదు చేసి ఇలాంటివి పునరావృతం కాకుండా గట్టి హెచ్చరికలు పంపాల్సిన బాధ్యత ఉందా లేదా....లేకపోతే దొరికితే దొంగ లేకపోతే దొర అన్న చందాన అవినీతి జలగలు పెత్తనం చెలాయిస్తుంటే వ్యవస్థలు చేష్టలుడిగి చూస్తుండిపోవాలా.. ఇవన్నీ కూడా అంతుచిక్కని ప్రశ్నలుగా ఉండిపోవడంతో అసలు బాపట్ల మున్సిపాలిటీలో ఏం జరుగుతోందన్న మీమాంస ప్రజలను కుదిపేస్తోంది..

అక్రమ లే అవుట్ల విషయంలోనూ...

కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా తీసుకున్న విధాన నిర్ణయంలో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న లే అవుట్ల జాబితాను మున్సిపాలిటీ ప్రజల ముందుంచింది. ఈ విషయంలో ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజార్చే విధంగా మధ్యతరగతి ప్రజలను ఇబ్బంది పెట్టడానికే ఇలాంటి చర్యలకు దిగిందనే దుష్ప్రచారాన్ని మొదలుపెట్టారు. ప్రభుత్వ విధానం ప్రకారం అక్రమ లే అవుట్ల జాబితాను బహిరంగ పరచిన మున్సిపాలిటీ ఈ విషయంపై వినియోగదారుల్లో ఉన్న అపోహలను తొలగించడంపై కనీస స్థాయిలో కూడా దృష్టి పెట్టలేకపోయింది. ప్రభుత్వ ఖజానాకు సున్నం వేసి అడ్డగోలుగా వ్యవహరించిన వారిపైనే చర్యలు తప్ప ప్లాట్లు కొనుక్కున్న మధ్యతరగతి వర్గాలను ఇబ్బంది పెట్టే ఉద్దేశమేది ప్రభుత్వానికి లేదనే ప్రకటనను మున్సిపాలిటీ అధికారులు ప్రజలకు వివరించలేకపోయారు. ఇవన్నీ కూడా బాపట్ల మున్సిపాలిటీలో జరుగుత్నున్న అస్తవ్యస్త విధానాలకు నిదర్శనంగా కనబడుతోంది.

మున్సిపాలిటీ చుట్టూ వివాదాలు

ఈ మధ్యవర్తుల అవినీతి బాగోతం రాకముందే అనేక వివాదాస్పద అంశాలు మున్సిపాలిటీని చుట్టుముట్టాయి. వైసీపీ ఐదేళ్ల పాటు చేసిన పాపాలకు మున్సిపాలిటీ అప్పుల కుప్పలా తయారయింది. ఆర్థిక సంఘం నిధులను సైతం దారి మళ్లించిన ఘనత వైసీపీది. ఇదే సమయంలో నీటి పన్ను, ఆస్తి పన్ను రూపంలో రావాల్సిన బకాయిలు కూడా మున్సిపాలిటీలో చాలానే ఉన్నాయి. వాటిపై దృష్టిసారించి ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చుకోవడంపై ఎలాంటి అడుగులు వేయాలో కసరత్తు చేయాల్సి ఉంది. కానీ దీనికి భిన్నంగా మున్సిపాలిటీ అప్పుల్లో ఉందనే సంకేతాన్ని పంపి ఓ విధంగా ఫండ్ రైజింగ్ కార్యక్రమం చేపట్టడాన్ని పలువురు తప్పుబడుతున్నారు. దాదాపు నెలన్నర క్రితం పట్టణంలోని రియల్టర్లతో సమావేశమైన మున్సిపల్ అధికారులు సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ)కింద విరాళం అందించాలని అభ్యర్థించడం గమనార్హం. అసలు సీఎస్ఆర్ పరిధిలోకి రావాలంటే నిర్దిష్టమైన మార్గదర్శకాలను కేంద్ర ప్రభుత్వం సూచించింది. జిల్లాలో దాని పరిధిలోకి వచ్చే పరిశ్రమలు ఐదులోపే ఉన్నట్లు సమాచారం. అలాంటిది ఏకంగా వారిని సీఎస్ఆర్‌కింద బాధ్యత తీసుకోమనడం విమర్శలకు తావిచ్చింది. ఇదే కాకుండా టీడీపీ ద్వితీయశ్రేణి నేతలు మున్సిపాలిటీని వేదికగా చేసుకుని పెత్తనం చెలాయించాలని చూస్తుండడంతో ప్రతిష్ఠ మరింతగా మసకబారుతోంది.

ప్రభుత్వం వైపు నుంచి విచారణ ఏది...

మధ్యవర్తులు పేరిట డబ్బులు వసూలు చేశారని ఎమ్మెల్యేనే ప్రకటించారు. ఈ అంశంలో అధికారుల వైపు నుంచి విచారణ చేపట్టి అసలు బాధితులు ఎవరు అనే కోణంతో పాటు మధ్యవర్తులు డబ్బులు వసూలు చేసింది ఎవరికి ఇవ్వడానికి వీటన్నింటిపై సమాధానం రాబట్టాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉంది. ఆరోపణలు వచ్చాయి, రాజకీయంగా పరిష్కారం చూపినట్లు నేతలు ప్రకటించారు. అంతటి తో సరిపోయింది అన్నట్లుగా ఆ విషయాన్ని మరుగున పడేయడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. శాఖాపర మైన విచారణ చేపట్టి ఈ ఎపిసోడ్‌లో కీలకంగా వ్యవహ రించేదెవరు అనే అంశంతో పాటు ఈ దందా ఎప్పటి నుం చి సాగుతుంది, గతంలో ఎంత అవినీతికి పాల్పడ్డారు వీట న్నింటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత సదరు వ్యవస్థలపై ఉంది.

ప్రజల్లో తీవ్రమైన చర్చ....

గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏ నిబంధనలను లెక్క చేయకుండా మున్సిపాలిటీ మీద స్వారీ చేశారు. నేతలు, కొంతమంది అధికారులు కలిసి అందినకాడికి దండుకున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో పారదర్శకపాలన దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో వెలుగులోకి వచ్చిన అవినీతి వ్యవహారంలో బాధితులకు న్యాయం జరగడం ఎంత ముఖ్యమో, మధ్యవర్తుల పేరిట అడ్డగోలుగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందేనన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

- మంతెనవారిపాలెంలో తెగిన కట్టను బలపరుస్తున్న ఎక్స్‌కవేటర్



ముమ్మరంగా డ్రెయిన్లకు మరమ్మతులు

రేపల్లె, సెప్టెంబరు 16 : అధిక వర్షాల కారణంగా డ్రెయిన్‌లు పొంగి కట్టలకు గండ్లు పడడంతో, తీరప్రాంతంలోని పొలాలన్నీ ముంపునకు గురయ్యాయి. దీంతో రైతులకు లక్షలాది రూపాయల నష్టం కలిగింది. రేపల్లె నియోజకవర్గంలోని నగరం మండలం ఈదుపల్లి, మంతెనవారిపాలెం ఓల్డుకోర్సు డ్రెయిన్లకు గండ్లుపడటంతో, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టి సారించి తక్షణమే డ్రెయిన్‌లు కరకట్టలను పటిష్టపర్చాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు నియోజకవర్గంలోని ప్రధాన డ్రెయిన్ తెగిపోయిన ప్రాంతాలను పటిష్ట పరిచేందుకు చర్యలు చేపట్టారు. సోమవారం డ్రెయిన్‌ల కట్టలు పూడిక పనులు మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ దగ్గర ఉండి పనులను పర్యవేక్షించారు. రాబోయే రోజుల్లో డ్రెయిన్‌ల కట్టలు తెగిపోకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భారీ వర్షం కురిస్తే డ్రెయిన్‌లు వ్యర్థాలతో పూడుకుపోవటం వల్ల నీరు పారుదల కాక గండ్లు పడుతున్నాయని ఎప్పటికప్పుడు డ్రెయినేజీ అధికారులు తూటికాడ, వ్యర్థాలను తొలగిస్తే ఇలాంటి ప్రమాదాలు సంభవించవని అధికారులకు సూచించారు. తక్షణమే కోతలకు గురైన కట్టలను పూర్తిస్థాయిలో బలపర్చాలని సూచించారు.



- ఈదుపల్లిలో తెగిన కట్టను బలపరుస్తున్న సిబ్బంది

- చీరాల ఉప ఖజానా కార్యాలయం



చీరాల ఉప ఖజానా కార్యాలయంలో వర్గపోరు

- విచారణ చేపట్టిన ఆర్డీఓ, డీటీఓ తదితరులు
- కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్న విచారణ అధికారులు

చీరాల, సెప్టెంబరు 16 : చీరాల ఉపఖజానా కార్యాలయంలో వర్గ పోరు నడుస్తోంది. దీంతో ఉపఖజానా కార్యాలయం నుంచి సేవలు పొందాల్సిన వారికి చేదుఅనుభవం ఎదురౌతోంది. పెన్షన్లు, ఎరియర్స్, పనుల బిల్లులు తదితరాలకు సంబంధించిన పనులు ఈ నెల 4వ తేది నుంచి అటకెక్కాయి. ఎస్టీఓ భాగ్యలక్ష్మి ఆఫీస్ ఆర్డరును మార్పు చేయటం అందుకు కారణంగా చెప్తున్నారు. కార్యాలయంలో పనిచేసే వారిలో ఎస్టీఓ భాగ్యలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ సుధీరా ఒక వైపు, మిగిలిన సీనియర్ అసిస్టెంట్లు సిబ్బంది మరో వైపుగా విడిపోయి ఆధిపత్య పోరుకు సిద్ధపడటం అందుకు కారణమని సమాచారం. దీనికి సంబంధించి సదరు ఉద్యోగుల అసోసియేషన్‌కు చెందిన ఓ వ్యక్తి తెరవెనుక చక్రం తిప్పటం అందుకు కారణమని విశ్వసనీయ సమాచారం. ఈ క్రమంలో విషయం స్థానిక ప్రజాప్రతినిధి దృష్టికి వెళ్లింది. ఆయన సామరస్యంగా రాతపూర్వకంగా చేసిన సూచనలను వక్రీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం ఆర్డీఓ సూర్యనారాయణరెడ్డి, డీటీఓ పరమేశ్వరి విచారణ చేపట్టారు. విచారణ నివేదికను కలెక్టరుకు అందజేస్తామని ఆర్డీఓ సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం సెలవు అయినప్పటికి పెండింగ్ పనులను పూర్తిచేసినట్లు ఎస్టీఓ భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఎస్టీఓ కార్యాలయంలో వర్గపోరు కొనసాగుతున్నట్లు ప్రాథమిక విచారణలో తెలిసింది. కార్యాలయంలో ఆఫీస్ ఆర్డర్ మార్పుకు సంబంధించి నెల కొన్న పరిణామాల క్రమంలో ఆ వర్గపోరుకు దారితీసినట్లు విచా రణలో వెల్లడయ్యింది. అందరి వాదనలను రికార్డు చేశాం. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. ఎస్టీఓ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కార్యాలయంలో ఆఫీస్ ఆర్డర్ మార్పు నేపథ్యంలో నెలకొన్న పరిణామాలపై ఆర్డీఓ, డీటీఓ విచారణ చేపట్టారు. పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేయటం జరిగింది. అన్ని విషయాలు పరిగణలోకి తీసుకుని విచారణ చేపట్టారు.

మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి
క్యాట్

దరఖాస్తు గడువు తేదీ సెప్టెంబరు 20కి పొడిగింపు



మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన పరీక్ష 'కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)' దరఖాస్తు గడువు తేదీని పొడిగించారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబరు 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించే క్యాట్‌లో సాధించిన పర్సంటైల్ ఆధారంగా సీట్లను కేటాయిస్తారు. క్యాట్ స్కోరు ఆధారంగా ఐఐఎంలే కాకుండా ఇతర ప్రముఖ కళాశాలలు కూడా సీట్లను భర్తీ చేస్తాయి. ఈ ఏడాది పరీక్షను దేశవ్యాప్తంగా 170 నగరాల్లో నిర్వహించనున్నారు.

ఐఐఎంలు: ముంబయి, అమృత్‌సర్, బెంగళూరు, బోధ్ గయా, కోల్‌కతా, ఇండోర్, జమ్ము, కాశీపూర్, కోజికోడ్, లఖ్‌నవూ, నాగ్‌పూర్, రాయ్‌పూర్, రాంచీ, రోహ్‌తక్, సంబల్‌పూర్, షిల్లాంగ్, సిర్మౌర్, తిరుచిరాపల్లి, ఉదయపూర్, విశాఖపట్నం.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 45 శాతం మార్కులు చాలు. డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం: ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. పరీక్షలో మూడు విభాగాలు ఉంటాయి. సెక్షన్-1 వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్, సెక్షన్-2 డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, సెక్షన్-3 క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు మూడు మార్కులు కేటాయించారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఆయా సంస్థలు గ్రూప్ డిస్కషన్స్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూస్ నిర్వహించి తుది ఎంపికను చేపడతాయి.

రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.1250 చెల్లించాలి.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, చిత్తూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 20

అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్: నవంబరు 5 నుంచి 24 వరకు

పరీక్ష తేదీ: నవంబరు 24

ఫలితాల ప్రకటన: జనవరి రెండో వారంలో

వెబ్‌సైట్: https://iimcat.ac.in/

దిక్సూచి DIKSUCHI

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తు గడువు పొడిగించింది. అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు. పీజీ ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. పీహెచ్‌డీ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తిచేసే వీలుంది.

ఎన్‌జీ రంగా వర్సిటీలో ఎన్ఆర్ఐ కోటా



స్పెషలైజేషన్‌లు

అగ్రికల్చర్: జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, ప్లాంట్ పాథాలజీ, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైక్రో బయాలజీ, సాయిల్ సైన్స్, మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, ఎంటమాలజీ, ఆగ్రోనమీ, అగ్రికల్చరల్ ఎకనామిక్స్, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్.

అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ: సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేషన్ ఇంజనీరింగ్, ప్రాసెస్ అండ్ ఫుడ్ ఇంజనీరింగ్, ఫామ్ మెషినరీ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ.

కమ్యూనిటీ సైన్స్(హోమ్ సైన్స్): ఫుడ్ అండ్ న్యూట్రిషన్, హ్యూమన్ డెవలప్‌మెంట్ అండ్ ఫ్యామిలీ స్టడీస్, రిసోర్స్ మేనేజ్‌మెంట్ అండ్ కన్జ్యూమర్ సైన్స్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్.

సీట్ల వివరాలు: పీజీ ప్రోగ్రామ్‌లో 53 సీట్లు ఉన్నాయి. కమ్యూనిటీ సైన్స్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగాలకు ఒక్కోదానిలో రొటేషనల్ బేసిస్ మీద 6 సీట్లు నిర్దేశించారు. అగ్రికల్చర్ విభాగానికి 41 సీట్లు కేటాయించారు.

- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో 14 సీట్లు ఉన్నాయి. కమ్యూనిటీ సైన్స్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగాలకు ఒక్కో దానిలో రొటేషనల్ బేసిస్ మీద ఒక సీటు నిర్దేశించారు. అగ్రికల్చర్ విభాగానికి 12 సీట్లు కేటాయించారు.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో
పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు

హైదరాబాద్‌లోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూఓహెచ్) 2024-25 విద్యా సంవత్సరానికిగాను వివిధ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి గడువు తేదీని పొడిగించింది. మొత్తం 22 పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఆల్ ఇండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ ద్వారా సీట్లను భర్తీ చేస్తారు. హైదరాబాద్, భువనేశ్వర్, కొచ్చి, పట్నా, ఢిల్లీ, గువాహటి, కోల్‌కతాల్లో ప్రవేశ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

స్పెషలైజేషన్లు - సీట్లు

- ఇంగ్లీష్-6, తెలుగు-19, ఉర్దూ-3, అప్లయిడ్ లింగ్విస్టిక్స్-8, హిస్టరీ-8, పొలిటికల్ సైన్స్-10, సోషియాలజీ-20, ఆంత్రోపాలజీ-9, ఎడ్యుకేషన్-2, రీజనల్ స్టడీస్-5, ఇండియన్ డయాస్పొరా-2, సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ-4, జెండర్ స్టడీస్-5, ఎకనామిక్స్-28, డ్యాన్స్-3, ఆర్ట్ హిస్టరీ అండ్ విజువల్ స్టడీస్-1, కమ్యూనికేషన్-3, ట్రాన్స్‌లేషన్ స్టడీస్-4, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్టడీస్-8, హెల్త్ సైన్సెస్: ఆప్టోమెట్రి-2, మెటీరియల్స్ ఇంజనీరింగ్-16, నానో సైన్స్ అండ్ టెక్నాలజీ-4.
- ఇంతకు ముందు(నోటిఫికేషన్ తేదీ 2024 జూన్ 3) దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మరల దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు.


అర్హత: కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.550; ఓబీసీ-ఎన్‌సీఎల్ రూ.400; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ(పీహెచ్) అభ్యర్థులకు రూ.275.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 20
- **హాల్ టిక్కెట్స్ డౌన్‌లోడ్:** అక్టోబరు 10
- **ప్రవేశ పరీక్ష తేదీలు:** అక్టోబరు 19, 20
- **ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** నవంబరు 18
- **ఇంటర్వ్యూలు :** నవంబరు 18 నుంచి 21 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** డిసెంబరు 2
- **అడ్మిషన్ కౌన్సిలింగ్ తేదీలు:** డిసెంబరు 10, 11
- **తరగతులు ప్రారంభం:** 2025 జనవరి 1
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in/

నవ్య చిత్రజ్యోతి

బీస్ట్ మోడ్ ఆన్



బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రామ్‌చరణ్ ఓ చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి 'ఆర్‌సి16' అనేది వర్కింగ్ టైటిల్. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్‌లో ఉంది చిత్రం. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. తాజాగా, రామ్‌చరణ్ ఓ ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసి ఈ సినిమాపై అంచనాలను రెట్టింపు చేశారు. "బీస్ట్ మోడ్ ఆన్. ఆర్‌సీ 16 లోడింగ్" అని పేర్కొన్నారు.

ఓనమ్ పర్వదినం సందర్భంగా 'కూలీ' సినిమా సెట్స్‌లో సూపర్‌స్టార్ రజనీకాంత్ స్టెప్పులేశారు. ఆయన నటిస్తున్న 'వేట్టయాన్' సినిమాలోని 'మానసిలాయో' పాటకు స్టెప్పులేసి ఆయన చిత్రబృందంలో జోష్ తెచ్చారు. ఈ సినిమాలోని కీలక సన్నివేశాల చిత్రీకరణ వైజాగ్‌లో జరుగుతున్న సంగతి తెలిసిందే.












వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి హీరో సాయిదుర్గ తేజ్ విరాళంగా ప్రకటించిన రూ. పది లక్షలు, హీరో విష్వక్‌సేన్ రూ పది లక్షలు, నిర్మాత సూర్యదేవర నాగవంశీ రూ. 25 లక్షలు, హాస్యనటుడు ఆలీ దంపతులు రూ. 3లక్షల చెక్కులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంతరెడ్డికి అందజేశారు.

తిన్నడి స్నేహితుడు



విష్ణు మంచు నటిస్తున్న 'కన్నప్ప' నుంచి ప్రతి సోమవారం వస్తున్న అప్‌డేట్లు సినిమా మీద అంచనాలు పెంచుతున్నాయి. ఈ సోమవారం తిన్నడికి విధేయుడు, స్నేహితుడు అయిన టిక్కీని పరిచయం చేశారు. టిక్కీ మరెవరో కాదు.. విష్ణు స్వారీ చేసే గుర్రం. టిక్కీతో ఉన్న విష్ణు పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో విష్ణు లుక్ ఆకట్టుకుంటోంది. డాక్టర్ మోహన్‌బాబు ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న 'కన్నప్ప' చిత్రానికి ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకుడు. డిసెంబర్‌లో ఈ భారీ చిత్రం విడుదల కానుంది.

నువ్వే నా సూర్యుడు.. చంద్రుడు



నటుడు సిద్ధార్థ్, నటి అదితీరావు హైదరీ సోమవారం వివాహబంధంలోకి అడుగుపెట్టారు. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు అదితి. 'నువ్వే నా సూర్యుడు.. చంద్రుడు.. నువ్వే నా తారాలోకం. మిసెస్ అండ్ మిస్టర్ అదు సిద్ధు' అనే క్యాప్షన్‌ను ఆమె జత చేశారు. వీరి పెళ్లి ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్‌లోని వీరి వివాహం జరిగిందని అంటున్నారు కానీ అక్కడి ఆలయంలో మాత్రం ఆ ఛాయలేవీ కనిపించలేదు. అక్కడ ఏ వివాహం కూడా జరగలేదని ఆలయ పూజారులు తెలియజేస్తున్నారు. మరెక్కడైనా ఆ వివాహం జరిగిందేమోననే భావన వ్యక్తమవుతోంది. అదితీరావు హైదరీ వనపర్తి సంస్థానాధీశుల్లో చివరి రాజుగా ఉన్న రామేశ్వర్‌రావు మనుమరాలు, ఆయన కూతురు విద్యారావు సంతానం అదితి. సిద్ధార్థ్, అదితి ఇద్దరికీ ఇది రెండో వివాహం. సిద్ధార్థ్ తన చిన్ననాటి స్నేహితురాలు మేఘనను 2003లో ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత 2007లో ఇద్దరి మధ్యలో వచ్చిన విభేదాల కారణంగా విడాకులు తీసుకున్నారు. అదితి 2002లో సత్యదీప్ మిశ్రాను పెళ్లి చేసుకొని 2012లో విడిపోయారు.

- ఆంధ్రజ్యోతి, శ్రీరంగాపూర్

ఇన్ ప్రోగ్రెస్

జైలుకి వెళ్లిన గొర్రె



సుహాస్ హీరోగా నటించిన యూనిక్ ఎంటర్‌టైనర్ 'గొర్రె పురాణం' ఈ నెల 20న విడుదల కానుంది. పురాణం బాబీ దర్శకత్వంలో ప్రవీణ్‌రెడ్డి నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. 'నా పేరు రామ్.. అలియాస్ యేసు. గొర్రె జైల్లో ఉండడం ఏందీ.. అడికెల్లి తప్పించుకోవడం ఏంది? ఇదంతా మీకు వింతగా ఉంది కదూ' అనే వాయిస్ ఓవర్‌తో ట్రైలర్ మొదలైంది. ఒక గొర్రె ఓ గ్రామంలో రెండు మతాల మధ్య చిచ్చు పెట్టిన నేపథ్యాన్ని చాలా ఆసక్తికరంగా ప్రజెంట్ చేశారు. పోసాని కృష్ణమురళి, రఘు కీలక పాత్రలు పోషించారు.

మహిళల రక్షణ కోసం



ప్రవీణ్ కె.వి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మహీష'. యషిక, పృథ్వీరాజ్, వైష్ణవి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆదివారం ఈ సినిమా టీజర్‌ను దర్శకుడు కొండా విజయ్‌కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "టీజర్ బాగుంది. మహిళల రక్షణ కోసం చేసిన చిత్రమిది" అని చెప్పారు. "ధర్మాన్ని ఎలా కాపాడాలో ఇందులో చూపిస్తున్నాం. ప్రేక్షకులకు కావాల్సిన అన్ని ఎలిమెంట్స్ ఇందులో ఉన్నాయి" దర్శకుడు, హీరో ప్రవీణ్ కె.వి అన్నారు.

ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చేలా..



చంద్రహాస్ హీరోగా నటిస్తున్న 'రామ్‌నగర్ బన్నీ' చిత్రం టీజర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సినిమాలో విస్మయశ్రీ, రిచా జోషి, అంబికా వాణి, రీతూ మంత్ర హీరోయిన్లు. శ్రీనివాస్ మహత్ దర్శకుడు. అక్టోబర్ నాలుగున సినిమాను విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు మలయజ ప్రభాకర్, పొడకండ ప్రభాకర్ చెప్పారు. ఈ సినిమా కోసం చంద్రహాస్ బాగా కష్టపడ్డాడనీ, అతనికి మంచి పేరు తెచ్చే సినిమా అవుతుందని దర్శకుడు శ్రీనివాస్ మహత్ చెప్పారు. అన్ని ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులందరికీ నచ్చేలా చిత్రం ఉంటుందని తెలిపారు. ఫ్యామిలీ ఆడియన్స్‌ను దృష్టిలో పెట్టుకుని చిత్రకథ ఎన్నుకున్నామనీ, తన కుమారుడి మొదటి సినిమాను సకుటుంబంగా ప్రేక్షకులు చూడాలనుకున్నామనీ ప్రభాకర్ చెప్పారు మరో రెండు సినిమాలు ఉన్నా మొదట 'రామ్‌నగర్ బన్నీ'నే విడుదల చేస్తున్నామని తెలిపారు.

సండే గర్ల్ ఫ్రెండ్



కామ్నా శర్మ, సుమన్. ఆలీ ప్రధాన పాత్రలు పోషించే 'సండే గర్ల్ ఫ్రెండ్' షూటింగ్ సోమవారం ప్రారంభమైంది. హీరోయిన్ కామ్నాపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు నటి ఇంద్రజ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, ఆలీ తొలి క్లాప్ ఇచ్చారు. సుమన్ స్క్రిప్ట్ అందజేశారు. లవ్, మ్యూజికల్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉంటుందని దర్శకుడు గడ్డం వెంకటరమణారెడ్డి చెప్పారు. పాటల రికార్డింగ్ పూర్తయిందనీ, త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలు పెడతామనీ ఆయన తెలిపారు.

సైకలాజికల్ థ్రిల్లర్



ప్రిన్స్, నరేశ్ అగస్త్య హీరోలుగా నటించిన 'కలి' చిత్రం అక్టోబర్ 4న విడుదల కానుంది. జర్నలిస్టు రాఘవేంద్రరెడ్డి సమర్పణలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి శివ శేషు దర్శకుడు. కలి పాత్ర చుట్టూ అల్లుకున్న కథ ఇదనీ, ఈ సైకలాజికల్ థ్రిల్లర్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి కలిగిస్తుందనీ దర్శకుడు చెప్పారు. లీలా గౌతమ్ వర్మ ఈ సినిమాకు నిర్మాత. నేహా కృష్ణన్, గౌతంరాజు, గుండు సుదర్శన్, మణిచందన, మధుమణి ఇతర ముఖ్య తారాగణం.


బాలీవుడ్‌లో హీరోలు..
దక్షిణాదిలో విలన్లు

తెలుగు సినిమాల్లో ప్రతినాయక పాత్రలకు పరభాషా విలన్లను ఎంచుకోవటం మేకర్స్‌కు ఎప్పట్నుంచో ఉన్న ఆనవాయితీ. అయితే ఆ పరభాషా విలన్ల స్థానంలో ఇప్పుడు ఒకే ఇండస్ట్రీకి చెందిన నటులు ఎక్కువగా కనిపిస్తున్నారు. బాలీవుడ్‌లో హీరోలుగా ఉన్న ఎంతో మంది నటులు ఇప్పుడు దక్షిణాది సినిమాల్లో విలన్లుగా ఎంట్రీ ఇస్తున్నారు. అలా దక్షిణాదిలో విలన్లుగా మారిన వారెవరో ఓ లుక్కేద్దాం.











సైఫ్ అలీఖాన్

బాలీవుడ్‌లో మంచి హిట్ ట్రాక్ ఉన్న కథానాయకుల్లో సైఫ్ అలీఖాన్ ఒకరు. లవర్ బాయ్ నుంచి యాక్షన్ రోల్స్ వరకు ఎన్నో పాత్రల్లో నటించి మెప్పించిన ఆయన.. ప్రస్తుతం ప్రతినాయకుడిగా మారారు. ఇప్పటికే ఓం రౌత్ దర్శకత్వంలో ప్రభాస్ నటించిన పౌరాణిక చిత్రం 'ఆదిపురుష్' చిత్రంలో రావణుడి పాత్రను పోషించారు సైఫ్. ఇప్పుడు కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ నటిస్తున్న 'దేవర'లో 'భైర' పాత్రలో నటిస్తున్నారు. ఇటీవలే విడుదలైన 'భైర' గ్లింప్స్, ట్రైలర్‌తో సినిమాలో ఆయన పాత్ర ఎంత క్రూరంగా ఉంటుందో సినీ ప్రియులకు మేకర్స్ హింటిచ్చారు.

ఇమ్రాన్ హష్మీ

బాలీవుడ్‌లోనే మోస్ట్ రొమాంటిక్ హీరోల్లో ఇమ్రాన్ హష్మీ ఒకరు. సీరియల్ కిస్సర్‌గా పేరు తెచ్చుకున్న ఆయన.. ఇప్పుడు ప్రతినాయకుడి పాత్రలకు సిద్ధమయ్యారు. సుజీత్ దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ నటిస్తున్న 'దే కాల్ హిమ్ ఓ.జీ' (ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్)లో ఆయన ఓమి భాయ్ అనే పాత్రలో కనిపిస్తున్నారు. ఇమ్రాన్ బర్త్‌డే సందర్భంగా రిలీజైన పోస్టర్‌లో ఆయన పాత్ర ఎంతో పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని అర్థమవుతోంది.

సంజయ్ దత్

దక్షిణాదికి బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ హీరోగానూ.. విలన్‌గానూ ఇప్పటికే సుపరిచితం. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో యష్ హీరోగా నటించిన 'కేజీఎఫ్' సిరీస్‌లో 'అధీరా' పాత్రలో కరడుగట్టిన విలన్‌గా ఆయన కనిపించారు. గతేడాది లోకేశ్ కనగరాజ్, తమిళ నటుడు విజయ్ కలయికలో వచ్చిన 'లియో'లోను ఆయన పోషించిన పాత్ర ప్రతినాయక ఛాయలున్నదే. ఈ మధ్యే రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'డబుల్ ఇస్మార్ట్' చిత్రంలోనూ 'బిగ్ బుల్'గా ఆయన అదరగొట్టారు. ప్రస్తుతం మారుతి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న హారర్ కామెడీ 'రాజా సాబ్'లోనూ ఆయన నటిస్తున్నారు. ఇందులో ప్రభాస్ జీవితాన్ని మలుపు తిప్పే ఘోస్ట్ పాత్రలో ఆయన కనిపించనున్నారని టాక్. అయితే ఇది పాజిటివా, నెగెటివా అన్నది ప్రస్తుతానికి సస్పెన్స్. ఇక ఇప్పటికే వివేక్ ఒబెరాయ్ 'వినయ విధేయ రామ', 'వివేకం' 'లూసీఫర్'లో.. అర్జున్ రామ్‌పాల్ 'భగవంత్ కేసరి'లో.. అక్షయ్‌కుమార్ '2.0' చిత్రాలలో విలన్ పాత్రలు పోషించిన సంగతి తెలిసిందే.

బాబీ డియోల్

ప్రతినాయకుడి అవతారమెత్తిన మరో బాలీవుడ్ కథానాయకుడు బాబీ డియోల్. ఇప్పటికే 'యానిమల్' సినిమాలో రణ్‌బీర్‌తో తలపడ్డారు ఆయన. 'యానిమల్'లో కనిపించింది కాసేపు అయినా.. తన నటనతో ప్రేక్షకులకు విలన్ అంటే వీడేరా అనే ఫీల్‌ను కలిగించారు బాబీ. ఆయన ప్రస్తుతం దక్షిణాదిలో విలన్‌గా వరుస అవకాశాలను సొంతం చేసుకున్నారు. తమిళ నటుడు సూర్య నటిస్తున్న 'కంగువ'లో భీకరమైన పోరాట యోధుడిగా ఆయన కనిపించనున్నారు. అలాగే, కే.ఎస్.రవీంద్ర దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా నటిస్తున్న 'ఎన్‌బీకే109' చిత్రంలోనూ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. పవన్‌కల్యాణ్ నటిస్తున్న హిస్టారికల్ యాక్షన్ డ్రామా 'హరిహర వీరమల్లు'లోనూ బాబీడియోల్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఇందులో ఆయన మొఘల్ ఎంపెరర్ ఔరంగజేబ్ పాత్రను పోషించడం విశేషం. అలాగే విజయ్ నటిస్తున్న నూతన చిత్రంలోనూ ఆయన ప్రతినాయకుడి పాత్రను పోషించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిసింది. హెచ్.వినోద్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ సినిమా వర్కింగ్ టైటిల్ 'విజయ్ 69'.

సీఐలపై వేటుకు రంగం సిద్ధం

- చట్టాన్ని, నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరించిన సీఐలు
- వైసీపీ హయాంలో చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి

గుంటూరు, సెప్టెంబరు 16: చట్టాన్ని కాపాడి బాధితులకు న్యాయం చేయాల్సిన పోలీసులు చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పోలీస్ స్టేషన్లను వైసీపీ పంచాయతీ కార్యాలయాలుగా మార్చి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు. బాధితులపైనే తప్పుడు కేసులు బనాయించడం, వేధింపులకు పాల్పడటం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో అప్పట్లో చట్టవిరుద్ధంగా వ్యవహరించిన పలువురు సీఐల వ్యవహారం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుంది. ఈ క్రమంలో వారిపై వేటుకు రంగం సిద్ధమైంది. గత ప్రభుత్వ హయాంలో పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రముఖ జ్యువెలరీ షాపులో అందులో పని చేసే వ్యక్తే బంగారం చోరీ చేశాడు. దుకాణం యజమాని ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. అయితే నిందితుడి వద్ద స్వాధీనం చేసుకున్న బంగారంలో కొంత అప్పటి సీఐ విజయ్ చంద్ర నొక్కేశారు. చోరీ జరిగిన బంగారానికి, రికవరీ బంగారానికి వ్యత్యాసం ఉండడంతో దుకాణ యజమానులు పోలీసులు ఉన్నతాధికారులను ఆశ్రయించారు. దీనిపై ఎస్పీ సతీష్ కుమార్ విచారణకు ఆదేశించగా బంగారం నొక్కేసినట్లు, అంతేగాక చోరీ బంగారం కొనుగోలు చేసిన వ్యక్తి నుంచి డబ్బు కూడా గుంజినట్లు తేలింది. విచారణ అధికారి ఇచ్చిన నివేదిక ఆధారంగా అప్పటి పట్టాభిపురం సీఐ విజయచంద్ర పై ఐజి సర్వ శ్రేష్టత్రిపాఠి సస్పెండ్ చేశారు. ఇదిలా ఉంటే ఇప్పటికే తెనాలిలో ఓ యువతి ఫొటోలను మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్ చేసిన కేసులో ఇద్దరు నిందితులను తప్పించారనే ఆరోపణలపై తెనాలి టూ టౌన్ సీఐ సుధాకర్ సస్పెండ్ చేసిన విషయం విదితమే.

సీఐపై నేడో, రేపో వేటు

గత ప్రభుత్వంలో వైసీపీ నేతల అండదండలతో చెలరేగిన సీఐ వెంకటేశ్వరరెడ్డి ప్రభుత్వం మారిన తర్వాత కూడా తన వైఖరి మార్చుకోలేదు. గత ఎన్నికల సమయంలో అరండల్ పేట సీఐగా విధులు నిర్వహించిన వెంకటేశ్వరరెడ్డిపై అప్పట్లో ఓ కేసు విషయంలో అభియోగాలు వచ్చాయి. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన్ను వీఆర్‌కు పంపారు. వీఆర్‌లో ఉన్న వెంకటేశ్వరరెడ్డి ఆ తర్వాత మెడికల్ లీవ్ తీసుకున్నారు. మెడికల్ లీవ్‌లో ఉన్న అధికారి నిబంధనల మేరకు జిల్లా కేంద్రం దాటి వెళ్లకూడదు. అటువంటిది ఇటీవల జరిగిన దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతికి ఆయన హాజరు కావడం పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. వెంకటేశ్వరరెడ్డిని కూడా నేడో, రేపో సస్పెండ్ చేసే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. జిల్లా జైల్లో ఉన్న బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను పరామర్శించేందుకు ఇటీవల జగన్ వచ్చారు. ఆ కార్యక్రమం ముగిసిన తర్వాత జైలు బయట జైలు వార్డెన్ తన కూతురుతో కలిసి జగన్‌తో సెల్ఫీ దిగడం, ఆటోగ్రాఫ్ తీసుకోవడం కలకలం రేపింది. అయితే ఆమెకు ఇప్పటికే మెమో జారీ చేశారు. జైలు వార్డెన్ ఫొటో దిగడం సర్వీసు నిబంధనలకు విరుద్ధం. త్వరలో ఆమెను సస్పెండ్ చేయనున్నారు.

బాధితులపైనే హత్య కేసు..

వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఓ మంత్రి ఆదేశాల నేపథ్యంలో నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో తమ కుమార్తె అదృశ్యమైంది అంటూ ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులపైనే ఏకంగా పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. హత్యకు గురి కానప్పటికీ పోలీసులు హత్య కేసు నమోదు చేయడం సంచలనం సృష్టించింది. ఆ కేసులో పోలీసులు వ్యవహరించిన తీరును కోర్టు సైతం తీవ్రంగా ఆక్షేపించింది. చివరకు కేసులో బాధిత యువతి భర్త అత్తింటి వారి నిర్లక్ష్యంతో ప్రసవ సమయంలో కన్ను మూసింది. మొదట నుంచి పోలీసులు నిందితులకు అనుకూలంగా వ్యవహరించడం వల్లే చివరకు తమ కుమార్తె ప్రాణాలు కోల్పోయిందని బాధ్యత తల్లిదండ్రులు దీనిపై న్యాయ పోరాటం చేస్తూనే ఉన్నారు. అప్పటి నల్లపాడు సీఐ బత్తుల శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసు అధికారులను, ప్రజాప్రతినిధులను కలిశారు. కొద్దిరోజుల క్రితం హోంమంత్రి అనితను కూడా కలిసి ఫిర్యాదు చేశారు. ఆమె తీవ్రంగా పరిగణించి విచారణకు ఆదేశించారు. దీనిపై విచారణ జరిపిన అప్పటి సీసీఎస్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు నివేదికను రేంజ్ ఐజికి అందజేసినట్లు సమాచారం. ఈ కేసులో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన సీఐ బత్తుల శ్రీనివాసరావు, ఎస్ఐ జేత్య నాయక్, అప్పటి డీఎస్పీ జెస్సీ ప్రశాంతిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని తెలుస్తోంది.

ఎద్దుల బండలాగుడు పోటీలు ప్రారంభం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 16: జాతీయ స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు ప్రత్తిపాడులో సోమవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సోదరుడు పెమ్మసాని రవితో కలిసి ప్రారంభించారు. టీడీపీ ప్రత్తిపాడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఎద్దుల జతలు పోటీలో నిలిచాయి. వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది ఈ పోటీలను తిలకించేందుకు తరలివచ్చారు. పాలపళ్ల విభాగంతో ప్రారంభమైన పోటీల్లో తొలిగా పాల్గొన్న ఎద్దుల జత యజమానులకు జ్ఞాపికను అందజేశారు. అనంతరం తలపాగా చుట్టి, చెర్నాకోల చేతపట్టి ఎద్దులను నాయకులు అదిలించారు. అనంతరం పాలపళ్ల విభాగంలో పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ ప్రత్తిపాడులో జాతీయ స్థాయిలో ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రైతులు ఎంతో వ్యయ ప్రయాసలతో ఎద్దులను పోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కొర్రపాటి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు గింజుపల్లి వెంకటేశ్వరరావు, రావిపాటి సాయి, ఉగ్గిరాల సీతారామయ్య, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్, కాకాని సురేష్, చిన్నం శ్రీకాంత్, మర్రి వెంకటశివ, కుర్రి సుబ్బారెడ్డి, కల్లూరి శ్రీనివాసరావు, నూతలపాటి త్రిలోక్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి పెమ్మసాని సోదరుడు రవితో కలిసి రిబ్బన్ కట్ చేస్తున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

మల్లేశ్వర స్వామిని దర్శించుకున్న కమిషనర్



కమిషనర్ సత్యనారాయణకు స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న వరప్రసాదరావు

పెదకాకాని, సెప్టెంబరు 16: పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ సోమవారం సందర్శించారు. ఆలయ మర్యాదలతో అధికారులు, అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రదక్షిణ నిర్వహించి మల్లేశ్వర స్వామికి అభిషేకాలు నిర్వహించారు, భ్రమరాంబ అమ్మవారికి కుంకుమ పూజ జరిపించారు. అనంతరం ఆలయంలోని పలు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. రాహు కేతు మండపము, అన్నప్రసాద భవనం, పొంగలి భవనంను పరిశీలించారు. ఆలయ ఈవో శ్రీరామ వరప్రసాదరావు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 16: పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 36,783 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 51,042 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు. దీనిలో పవర్ జనరేషన్ ద్వారా 16 వేల క్యూసెక్కుల నీరు రెండు గేట్ల ద్వారా దిగువకు విడుదల అవుతుంది.

పదవులకు వన్నె తెచ్చిన కోడెల



సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు సన్మానిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, సెప్టెంబరు 16: గుంటూరు జిల్లా రాజకీయాల్లో డాక్టర్ కోడెల శివప్రసాదరావు చెరగని ముద్ర వేసుకున్నారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్ కోడెల శివప్రసాదరరావు 5వ వర్ధంతిని రామోజీరావు ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, రాజకీయ పార్టీలు అనే అంశం పై సీనియర్ న్యాయవాది పోసారి వెంకటేశ్వర్లు అధ్యక్షతన సభ జరిగింది. సభలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ డాక్టర్ కోడెల శివప్రసాదరావు నిత్యం ప్రజల గురించి ఆలోచించిన నేత అన్నారు. అభివృద్ధి అంటే పట్టుదలతో ముందుకు వెళ్లిన నేత కోడెల అని, ఏ పదవి నిర్వహించినా ఆ పదవికి వన్నె తెచ్చారన్నారు. నరసరావుపేట, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో అభివృద్ధే లక్ష్యంగా పని చేసి ప్రజా నాయకుడిగా పేరు తెచ్చుకున్న నేత కోడెల అన్నారు. జగన్ పరిపాలన ఒక నియంత పరిపాలనను తలపించిందన్నారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని జగన్ అవమాన పరుస్తూ రాజకీయ పార్టీలను కేసులతో ఇబ్బంది పెట్టారన్నారు. భయం గుప్పెట్లో రాష్ట్ర పాలన చేసిన వ్యక్తి జగన్ అన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి పాలన వద్దని జగన్‌ను ప్రజలు ఇంటికి పంపారన్నారు. ప్రజాపాలనే లక్ష్యంగా ముందుకు వెళ్తున్న ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వంలో కోడెల ఐదో వర్ధంతిని జరుపుకోవటం అభినందనీయమన్నారు. కోడెల వర్ధంతి కమిటీ కన్వీనర్ పోసాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డాక్టర్‌గా, రాజకీయ వేత్తగా కోడెల రాణించారన్నారు. డాక్టర్ కోడెల శివరామ్ మాట్లాడుతూ కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కోడెల వర్ధంతిని జరపటం అభినందనీయమన్నారు. సీనియర్ ప్రొఫెసర్ డీఏ సుబ్రహ్మణ్యంకు డాక్టర్ కోడెల శివప్రసాదరావు ప్రతిభా అవార్డును కన్నా లక్ష్మీనారాయణ, పోసారి వెంకటేశ్వర్లు, డాక్టర్ కోడెల శివరామ్ అందించి దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. సీనియర్ న్యాయవాది పోసారి వెంకటేశ్వర్లును కూడా ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు. ముందుగా డాక్టర్ కోడెల శివప్రసాదరావు, ఎన్టీఆర్ విగ్రహాలకు, రామోజీరావు చిత్రపటానికి కన్నా, టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జాతీయ విపత్తుగా గుర్తించాలి

- అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు అశోక్ జోడన్
- సహాయ చర్యల్లో చంద్రబాబు పని తీరు ఆదర్శమంటూ కితాబు



మాట్లాడుతున్న అశోక్ జోడన్, పక్కన జాస్తి వీరాంజనేయులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 16: ఇటీవల వరదలకు ఏపీకి అపార నష్టం జరిగిందనీ, ఈ ప్రమాదాన్ని జాతీయ విపత్తుగా కేంద్రం గుర్తించాలని అఖిల భారత పంచాయతీ పరిషత్(న్యూ ఢిల్లీ) జాతీయ అధ్యక్షుడు అశోక్ జోడన్ అన్నారు. కేంద్రం నుంచి మరిన్ని సహాయ చర్యలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గుంటూరు, బ్రాడీపేట సర్పంచుల సంఘ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా జిల్లాలో పూర్తిగా పర్యటించి పరిహారంపై అంచనాకు వచ్చామని, సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చి, రాష్ట్రానికి న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. కేంద్రం కల్పించుకుని నష్టపోయిన వారికి ఇందిరా నివాస్ యోజన, మహాత్మ గాంధీ గ్రామీణ పథకంతో లబ్ధి చేకూరేలా, ప్రతి ఎకరాకు రూ. 20 వేల నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. బాధితులను ఆదుకోవడంతోపాటు, సాంకేతిక పరిజ్ఞానంను ఉపయోగించుకోవడంలో చంద్రబాబు నాయుడు చొరవ ఆదర్శనీయమన్నారు. సర్పంచుల గౌరవ వేతనాన్ని పెంచాలని కోరారు. సంఘ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ పూర్తిగా దెబ్బతిన్న రహదారులకు ప్రత్యేక నిధులు విడుదల చేయాలని ప్రధాని, ఇతర కేంద్ర మంత్రులకి లేఖలు రాయనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో సర్పంచులు, స్థానిక సంస్థల ప్రతినిధులు ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.20 లక్షల వరకు బీమా ఇవ్వాలని కోరారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్పంచులకు ఓటు హక్కు కల్పించాలని కోరారు. సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, ఉపాధ్యక్షుడు షేక్ అల్లాబక్షు, నల్లపాటి లలిత కుమారి, పంచాయతీ పరిషత్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గోళ్ల మాల్యాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటాద్రినాయుడు వర్ధంతి

అమరావతి, సెప్టెంబరు 16: అమరావతిని రాజధానిగా చేసుకుని పరిపాలించిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు 208వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక అమరేశ్వరాలయం సమీపంలోని వెంకటాద్రినాయుడు విగ్రహానికి అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు అశోక్ జోడన్, ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు, సంయుక్త కార్యదర్శి జి.మాల్యాద్రినాయుడు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. స్థానిక కేంద్ర పురావస్తు సంగ్రాహాలయంలోని బౌద్ధ శిల్పాలను తిలకించారు.

అంటకాగిన అనుచరులదే రాజ్యం!

- నేటికీ కీలక స్థానాల్లో మాజీ ఉపకులపతి వర్గం
- వర్సిటీలో బదిలీలు చేపట్టాలని ఉద్యోగులు డిమాండ్

పెదకాకాని, సెప్టెంబరు 15: రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మాత్రం వైసీపీ ప్రభుత్వంతో అంటకాగిన మాజీ ఉపకులపతి అనుచరుల వాసన పోలేదు. నేటికీ మాజీ ఉపకులపతి అనుచరులే కీలక స్థానాల్లో కొనసాగటం చూస్తే విశ్వవిద్యాలయంలో నూతన అధికారులు బాధ్యతలు చేపట్టినప్పటికీ మాజీ ఉపకులపతి హవా కొనసాగుతున్నట్లు కనిపిస్తుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైసీపీ ప్రభుత్వంతో అంటకాగిన ఉపకులపతి రాజశేఖర్ ఈ ఏడాది జూలై ఒకటో తేదీన తన పదవికి రాజీనామా చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఏఎన్యూ కంప్యూటర్ సైన్స్ ఆచార్యులు గంగాధరరావును విశ్వవిద్యాలయం తాత్కాలిక ఉపకులపతిగా నియమించింది. ఈయన బాధ్యతలు చేపట్టి నేటికీ నెల రోజులు గడిచినా అధ్యాపకేతర ఉద్యోగుల బదిలీలపై దృష్టి సారించకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తుంది. ముఖ్యంగా వైసీపీ ప్రభుత్వంతో అంటకాగిన మాజీ ఉపకులపతి అనుచర ఉద్యోగులు ఉపకులపతి కార్యాలయం, పరీక్షా భవన్‌లో ఏసీఈ పదవితోపాటు ఇతర ఫోకల్ స్థానాలు, ఆయా పరీక్షల సమన్వయకర్తల విభాగాలతోపాటు పరిపాలన భవనంలోని అకౌంట్స్, ఎస్టాబ్లిష్మెంట్, అకడమిక్, లీగల్ సెల్, యూజీసీ తదితర విభాగాల్లో తిష్టవేసి ఇష్టారాజ్యంగా పెత్తనం చెలాయిస్తున్నారు. మాజీ ఉపకులపతి తన అనుచరవర్గం ఉద్యోగులకు కీలక స్థానాలతోపాటు ఫోకల్ పాయింట్లు కట్టబెట్టారు. ఆయా విభాగాల్లో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు మాజీ ఉపకులపతి అండదండలతో అందినకాడికి దోచుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పరీక్ష భవనలో డిగ్రీ విభాగాలకు సంబంధించిన ఓ కీలక అధికారి మాజీ ఉపకులపతితో అంటకాగి ఆయన చెప్పినట్లుగా తల ఊపారనే ఆరోపణలు వచ్చాయి. విశ్వవిద్యాలయం నిబంధనల ప్రకారం ఒకే స్థానంలో మూడేళ్ల పనిచేసిన ఉద్యోగులను బదిలీ చేయాలి. కానీ ప్రస్తుత తాత్కాలిక ఉపకులపతి గంగాధరరావు బదిలీలపై దృష్టి సారించకపోవడం ఉద్యోగులను తీవ్ర అసంతృప్తికి గురి చేస్తుంది. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ విశ్వవిద్యాలయంలో మాత్రం వైసీపీతో అంటకాగిన మాజీ ఉపకులపతి అనుచరులే నేటికీ కీలక స్థానాల్లో కొనసాగడం పట్ల పలువురు ఉద్యోగులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఉద్యోగుల బదిలీలపై దృష్టి సారించని తాత్కాలిక ఉపకులపతి తీరు విశ్వవిద్యాలయం పాలనపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు. దీనిపై మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదు చేసేందుకు పలువురు ఉద్యోగులు సమాయత్తమవుతున్నట్లు సమాచారం.

2 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, సెప్టెంబరు 16: నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ 2 క్రస్ట్ గేట్ల ద్వారా సోమవారం అధికారులు నీటిని విడుదల చేశారు. 2 గేట్లను 7 అడుగుల మేర ఎత్తి 22,366 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం 589.90 అడుగులు ఉంది. ఇది 311.74 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,000 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4613 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 22,366 క్యూసెక్కులు, 2 క్రస్ట్ గేట్ల ద్వారా 22,366 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 68,814 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 68,814 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నరెడ్కో అమరావతి అధ్యక్షుడిగా గల్లా రామచంద్రరావు



నూతన అధ్యక్షుడు గల్లా రామచంద్రరావు



జనరల్ సెక్రెటరీ ఎస్.రాంబాబు

గుంటూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నేషనల్ రియల్ వేస్టేట్ డెవలప్మెంట్ కౌన్సిల్ (నరెడ్కో) అమరావతి అధ్యక్షుడిగా శ్రీభ్రమర టౌన్‌షిప్ అధినేత గల్లా రామచంద్రరావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం సాయంత్రం విజయవాడలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నరెడ్కో జనరల్ బాడీ సమావేశం జరిగింది ఈ సమావేశంలో కొత్త కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గల్లా రామచంద్రరావుకు, కమిటీకి బోర్డు గౌరవ సభ్యులైన వీవీ నర్సయ్య, జి.పున్నారావు, కె. రామకోటేశ్వరరావు, వి.శ్రీనివాసరావు, రాజవరపు రవి, ఎంఎం కొండయ్య శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గల్లా రామచంద్రరావు మాట్లాడుతూ నరెడ్కో అమరావతి అధ్యక్షుడిగా తనని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నానన్నారు. రియల్ వేస్టేట్ రంగంలో ప్రతి ఒక్కరికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని, ఎవరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకొని భవిష్యత్తులో ఈ అసోసియేషన్ మరింత అభివృద్ధి చెందే విధంగా పనిచేస్తానన్నారు. రాజధాని అమరావతి ప్రాంతంలో అన్ని అనుమతులు ఉన్న అప్రూవుడ్ లేఅవుట్‌లు మాత్రమే చేయాలని, అటువంటి లేఔట్లను మాత్రమే నరెడ్కో ప్రోత్సహిస్తుందని గల్లా రామచంద్రరావు తెలిపారు. ముఖ్యంగా రాజధాని అమరావతి అభివృద్ధికి నరెడ్కో కొత్త కమిటీ శాయశక్తుల కృషి చేస్తుందని తెలిపారు. కొత్తగా ఎన్నికైన కమిటీకి అధ్యక్షుడిగా గల్లా రామచంద్రరావు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఏ.సాంబశివరావు, జనరల్ సెక్రటరీగా ఎన్.రాంబాబు, కోశాధికారిగా మారం చంద్ర శేఖర్, ఉపాధ్యక్షులుగా పెద్ది సుబ్బారావు, ఎం.హనుమంతరావు, ఎం.రామకృష్ణ, పీవీకే చైతన్య, జాయింట్ సెక్రెటరీలుగా టి.దుర్గాప్రసాదరావు, జి.శివ నాగబాబు, అజీమతుల్లా, ఈసీ మెంబర్లుగా కేవీఎస్ రామాంజనేయులు, ఎం.సత్యనారాయణ, డి.రమేష్ కుమార్, కె.కృష్ణ, జి.కృష్ణ హేమంత్, డి.రమేష్ కుమార్ ఎన్నికయ్యారు.

సత్యా ఎలక్ట్రానిక్ గృహోపకరణాల షోరూం ప్రారంభం



సత్యా షోరూంను ప్రారంభిస్తున్న ఫాదర్ లూయిస్, ప్రొప్రయిటర్ జయరాజ్, డీజీఎం సురేష్

గుంటూరు, సెప్టెంబరు 16: అమరావతి రోడ్డు గోరంట్లలో సత్యా ఎలక్ట్రానిక్ గృహోపకరణాల సత్యా ఏజెన్సీస్ 33వ షోరూం ప్రారంభోత్సవం సోమవారం అట్టహాసంగా జరిగింది. ఫాదర్ లూయిస్, ప్రొప్రయిటర్ జయరాజ్, డీజీఎమ్ ఎ.సురేష్, షోరూమ్ మేనేజర్ సురేంద్ర లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన, నమ్మకమైన ఎలక్ట్రానిక్ గృహోపకరణాలను అందించే సత్యా సంస్థ గోరంట్ల పరిసర ప్రాంత ప్రజలకు చేరువలోకి వచ్చిందన్నారు. అందరికీ అన్ని రకాల వస్తువులు అందుబాటు ధరల్లో లభిస్తాయన్నారు. ఏసీలు, ఫ్రిజ్‌లు, ఎల్ఈడీ టీవీలతోపాటు ఇతర ఎలక్ట్రానిక్ గృహోపకరణాలన్నీ ఒకే చోట అందుబాటులో ఉంటాయన్నారు. అన్ని కంపెనీల ఎలక్ట్రానిక్ గృహోపకరణాలను నాణ్యంగా, నమ్మకంగా అందుబాటు ధరల్లో అందించటమే సత్యా సంస్థ లక్ష్యమన్నారు. ప్రారంభం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ఉన్నాయన్నారు. అంతేగాక వివిధ రకాల బ్రాండ్లకు చెందిన మొబైల్ ఫోన్‌ల నుంచి మిక్సీలు, వాషింగ్‌మెషీన్లు, ఎయిర్ కూలర్లు అందుబాటులో ఉంచారు.

ఎన్నారై టీడీపీ విభాగం విరాళం



విజయవాడ వరదల నేపథ్యంలో ఎన్నారై టీడీపీ విభాగం భారీ విరాళాన్ని అందజేసింది. వారి తరుపున పలువురు టీడీపీ నేతలు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు 31,155 డాలర్లు, భారత కరెన్సీ ప్రకారం రూ. 26 లక్షల చెక్కును అందజేశారు. - గుంటూరు

ఆటో బోల్తా.. ఇద్దరు మృతి



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ కృష్ణారావు

నూజెండ్ల, సెప్టెంబరు 16: మండలంలోని తుర్లపాడు సమీపంలో సోమవారం జరిగిన ఆటో ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పమిడిపాడుకు చెందిన ఆటో వినుకొండ వెళ్తుండగా గ్రామానికి చెందిన టంగుటూరి పెద కోటిలింగం(70), కొత్తపమిడిపాడుకు చెందిన పానకాల వెంకటేశ్వర్లు(75) ఆటో ఎక్కారు. మార్గమధ్యంలో తెల్లబాడు సమీపంలో ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గోతిలో పడటంతో సంఘటనా స్థలంలోనే కోటిలింగం మృతి చెందగా, వినుకొండలో చికిత్స పొందుతూ పానకాల వెంకటేశ్వర్లు మృతి చెందాడు. వీరితోపాటు మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని ఐనవోలు ఎస్ఐ కృష్ణారావు పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాలను పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పీబీసీ కాలువలో పడి వివాహిత మృతి



కుంచా శివ (ఫైల్ ఫొటో)

నకరికల్లు, సెప్టెంబరు 16: భార్యభర్తలు బైక్‌పై వెళ్తుండగా బైక్ అదుపు తప్పి బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌లో పడింది. ఈ ప్రమాదంలో భర్త ఒడ్డుకు రాగా భార్య నీటిలో మునిగి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నకరికల్లు ఇందిరమ్మ కాలనీలో కుంచా వెంకట రామిరెడ్డి, అతని భార్య శివ నివాసం ఉంటున్నారు. సోమవారం ఉదయం 10:30 గంటల సమయంలో శ్రీరాంపురం గ్రామంలోని పీబీసీ కాలువ మార్గాన నరసింగపాడు బంధువుల ఇంటికి బయలు దేరారు. రైల్వే ట్రాక్ సమీపానికి వెళ్లేసరికి కుక్క అడ్డుగా వచ్చింది. కుక్కను తప్పించే ప్రయత్నంలో బైక్ అదుపు తప్పి కాలువలో పడింది. బైక్‌పై ప్రయాణిస్తున్న వెంకట రామిరెడ్డి ఒడ్డుకు చేరుకోగా, అతని భార్య శివ కాలువలో మునిగిపోయి మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం షాపులో చోరీ

పొన్నూరుటౌన్, సెప్టెంబరు16: పొన్నూరు పట్టణంలోని ప్రభుత్వ మద్యం షాపులో నగదు చోరీ సంఘటపై అర్బన్ పోలీసులకు సోమవారం ఎక్సైజ్ అధికారులు ఫిర్యాదు చేశారు. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఐలాండ్ సెంటర్ సమీపంలో బాపట్ల బస్టాండ్‌లో ప్రభుత్వ మద్యం దుకాణం నిర్వహిస్తున్నారు. గత రెండు రోజులుగా బ్యాంక్‌కు సెలవు కావటంతో విక్రయం తాలూకు నగదు సుమారు రూ.9.70 లక్షలు క్యాష్ కౌంటర్‌లో నిల్వ ఉంచి సిబ్బంది ఇళ్లకు వెళ్లారు. సోమవారం దుకాణం నిర్వహణకు సిబ్బంది రాగా వెనుక వైపు షట్టర్ పగలగొట్టి ఉండటాన్ని గమనించి చోరీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎక్సైజ్ అధికారుల ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నిరుద్యోగులకు సెల్‌ఫోన్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

గుంటూరు(విద్య), సెప్టెంబరు 16: యూనియన్ బ్యాంకు గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు సెల్‌ఫోన్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ జీబీ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్ రిపేరింగ్‌కు 19 నుంచి 45 ఏళ్ల వయస్సు ఉండి పది పాస్ లేదా ఫెయిలైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టైలరింగ్‌కు యువతులు, మహిళలు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.వివరాలకు 0863-2336912, 9700687696 సంప్రదించాలని సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129.140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

జాతీయ స్థాయి పోస్టర్ ప్రజెంటేషన్‌లో భవ్యశ్రీ ప్రతిభ

● విద్యార్థినికి కలెక్టర్ వెంకటమురళి అభినందనలు



ప్రథమ స్థానం సాధించిన భవ్యశ్రీని అభినందిస్తున్న కలెక్టర్ వెంకటమురళి తదితరులు

బాపట్ల, సెప్టెంబరు 16: ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకొని కేంద్ర పర్యావరణ వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీ వారు నిర్వహించిన పోస్టర్ ప్రజెంటేషన్ కాంపిటేషన్‌లో బాపట్ల జిల్లా విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలిచింది. కొండా మంజులూరు హైస్కూల్ విద్యార్థిని పంచుమర్తి భవ్యశ్రీ ప్రథమ స్థానంలో నిలవటంతో సోమవారం కలెక్టర్ జె.వెంకటమురళి విద్యార్థినిని అభినందించారు. జాతీయ స్థాయిలో జిల్లా పేరు నిలబెట్టినందుకు ప్రత్యేకంగా అభినందిస్తూ భవిష్యత్తులో ఏమికావాలనుకుంటున్నావు అని అడిగి తెలుసుకున్నారు. ఐఏఎస్ చదవాలని భవ్యశ్రీ చెప్పటంతో కలెక్టర్ ఏవిధంగా తర్ఫీదు కావాలో పలు సూచనలు చేశారు. కుటుంబ నేపథ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. మొదటి నుంచి చిత్రలేఖనంలో ఆసక్తి కనబరచటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఈవో కె.నారాయణరావు, జిల్లా పరీక్షల బోర్డు కార్యదర్శి డి.ప్రసాదరావు, జిల్లా సైన్స్ అధికారి మహ్మద్ సాధిక్, సైన్స్ కోఆర్డినేటర్ పి.భానుచంద్రమూర్తి, ఉపాధ్యాయులు టి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినికి రూ.10వేల ప్రోత్సహ నగదు, జ్ఞాపిక అందజేశారు.

కళాభిమానులకు బాపట్ల తరగని సంపద

● సంగీత కళాకారుడు మోదుమూడి సుధాకర్



మనోన్మని గేయ సంపుటి ఆవిష్కరిస్తున్న సంగీత కళాకారుడు మోదుమూడి సుధాకర్, రచయిత అచ్యుతుని శంభుప్రసాద్ తదితరులు

బాపట్ల, సెప్టెంబరు 16 : సంగీత, సాహిత్య రంగాల్లో ఆంధ్రరాష్ట్రంలో బాపట్లకు ప్రత్యేక స్థానం ఉందని, గురుశిష్య పరంపరగా అది నేటికి కొనసాగుతుండటం ఆదర్శనీయమని ఆకాశవాణి టాప్‌గ్రేడ్ సంగీత కళాకారుడు మోదుమూడి సుధాకర్ అన్నారు. బాపట్ల రోటరీ కల్యాణ మండపంలో జిల్లా రచయితల సంఘం, శ్రీవాణి కళానికేతనం, రోటరీక్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయులు అచ్యుతుని శంభుప్రసాద్ రచించిన మనోన్మని గేయసంపుటిని ఆవిష్కరించారు. కార్యక్రమానికి సుధాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కళాభిమానులకు బాపట్ల తరగని సంపద అన్నారు. కళాకారులకు ఇక్కడ లభించే ఆదరణ, ప్రోత్సాహం వల్ల అనేక మంది పద్మశ్రీ అవార్డులు సాధించారన్నారు. కార్యక్రమానికి నందిరాజు విజయ్‌కుమార్ అధ్యక్షత వహించగా భాగి కృష్ణమూర్తి, ప్రముఖ రచయిత కోన రమణారావులు కావ్యావిష్కరణ చేశారు. డీవీఎం సత్యనారాయణ కావ్య సమీక్ష చేశారు. అనంతరం దూరదర్శన్, ఆకాశవాణి గాయనులు పలుగీతాలతో సంగీతకచేరి నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు తిమ్మన శ్యామ్‌సుందర్, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పంట నష్టం లబ్ధిదారుల జాబితా విడుదల

అమృతలూరు, సెప్టెంబరు 16: మండలపరిధిలోని 13 రెవెన్యూ గ్రామాల పరిధిలో దెబ్బతిన్న పంట నష్టం జాబితా పూర్తయిందని మండల వ్యవసాయశాఖ అధికారి లోకేశ్వరి సోమవారం తెలిపారు. మంగళవారం ఆయా గ్రామాల్లోని సచివాలయాలు, రైతు సేవాకేంద్రాల వద్ద జాబితా ప్రదర్శనకు ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. రైతులు జాబితాలు పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే తెలపవచ్చున్నారు. తుది జాబితా బుధవారం జిల్లా ఉన్నతాధికారులకు పంపుతామని ఆమె చెప్పారు.

నేటి నుంచి స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు

బాపట్ల, సెప్టెంబరు 16 : ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో మంగళవారం నుంచి స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 17వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ముందుగా మున్సిపల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ, ర్యాలీ జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు.

ఆర్టీసీ అధికారులకు గత ప్రభుత్వంపై ప్రేమ తగ్గలేదా!



వైసీపీ రంగులతో ఉన్న ఆర్టీసీ బస్సు

అమృతలూరు, సెప్టెంబరు 16 : వైసీపీ ప్రభుత్వం ఓటమి పాలై ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చినా గత ప్రభుత్వం ఆనవాళ్ళు ఇంకా అలానే ఉండటంపై ఆర్టీసీ అధికారులకు గత ప్రభుత్వంపై ప్రేమ తగ్గలేదా? అని తెలుగుతమ్ముళ్ళు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే రేపల్లె ఆర్టీసీ డిపోకు చెందిన కొత్తపాలెం - విజయవాడ వయా చెరుకుపల్లి, అమృతలూరు మీదగా వెళుతుంది. సోమవారం అమృతలూరు వచ్చిన ఈ బస్సుపై ఇంకా వైసీపీ రంగులు ఉండటంపై తెలుగుతమ్ముళ్ళు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉందా, లేక వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉందా అని ప్రశ్నిస్తున్నారు. ప్రజా వ్యవస్థలో ఉన్న ఆర్టీసీ బస్సులపై ఉన్న వైసీపీ రంగులను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వరద బాధితులకు విరాళాల వెల్లువ

● ఎమ్మెల్యే వేగేశనకు రియల్ ఎస్టేట్ అండ్ బిల్డర్స్ రూ.10లక్షలు



ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు రూ.10లక్షలు చెక్కు అందజేస్తున్న వడ్లమూడి వెంకటేశ్వరరావు, గుంద్రెడ్డి శివ తదితరులు

బాపట్ల, సెప్టెంబరు 16: ముంచెత్తిన వరదలతో సర్వం కోల్పోయిన కుటుంబాల వారిని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు బాపట్ల రియల్ ఎస్టేట్ అండ్ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. 10లక్షల విరాళం అందజేశారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు సోమవారం అసోసియేషన్ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు, జీఎస్సార్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత గుంద్రెడ్డి శివ సభ్యులతో కలిసి చెక్కును అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధికి ఈ మొత్తాన్ని పంపించాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాట్లాడుతూ విరాళాలు అందిస్తున్న వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఎవరైన విరాళాలు ఇవ్వాలనుకుంటే చెక్కు రూపంలో సీఎం రిలీఫ్‌ఫండ్‌కు అందించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు గోపాళం వెంకటరెడ్డయ్య, నీలం చినబుజ్జి, ఉప్పాల వీరాస్వామి, ఆర్మీరవి, రామస్వామి తదితరులు ఉన్నారు.

సీఎం సహాయనిధికి లక్ష విరాళం

కర్లపాలెం, సెప్టెంబరు 16: వరద బాధితుల సహాయార్థం ఎల్‌వీఎస్ఆర్ డెవలపర్స్, ఆర్‌అండ్‌ఎల్ ఇన్‌ఫ్రా, శ్రీబాబు జనరల్ స్టోర్స్, టీఆర్‌కే ఎంటర్ ప్రైజస్ నిర్వాహకులు తూనుగుంట్ల లలితబాబు, సుబ్బారావులు ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.లక్ష విరాళాన్ని అందజేయటం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. చెక్కును తూనుగుంట్ల సుబ్బారావు దంపతులు నరేంద్రవర్మకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో గొలపల శ్రీనివాసరావు, అంద్రేయ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌కు రూ.50వేల చెక్కు అందజేత

బాపట్ల, సెప్టెంబరు 16: వరదబాధితులను ఆదుకునేందుకు చీరాల రాఘవేంద్ర ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి 50వేల రూపాయలు అందజేశారు. సోమవారం పట్టణంలోని వివేకానందకాలనీలో ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌ను కలిసి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గవిని మణికుమార్, ఉపాధ్యాయులు సురేష్, సుభానీ, వెంకట్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నగరం మండలంలో రూ.లక్ష విరాళం



సజ్జావారిపాలెంనకు చెందిన దేవాబత్తుని దేవి రూ.లక్ష చెక్కును అనగాని శివప్రసాద్‌కు అందజేత

రేపల్లె, సెప్టెంబరు 16: కృష్ణానదికి వరద పోటెత్తటంతో తీవ్ర నష్టపోయిన ప్రజలకు చేయూత నివ్వాలనే ఉద్దేశంతో నగరం మండలం సజ్జావారి పాలెం గ్రామానికి చెందిన డాక్టర్ దేవాబత్తుని దేవి (ఎన్‌ఆర్ఐ) సోమవారం మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్‌కు చెక్కు ను అందించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ నష్టపోయిన బాధితులకు అండగా నిలవాలని ఉద్దేశంతో దేవి లక్ష రూపాయల విరాళం ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తొట్టెంపూడి సుభాస్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయకుడి గ్రామోత్సవాలు



మత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణస్వామి ఆలయంలో వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, సెప్టెంబరు 16 : పట్టణంలోని మత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణస్వామి దేవాలయ ప్రాంగణంలో సిద్ధిబుద్ధి సమేత సంపత్ గణపతి పరివార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంపత్ గణపతి నవరాత్రి మహోత్సవాల్లో ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పాల్గొని పూజలు చేశారు. పూజా కార్యక్రమంలో నిర్వహకులు బి.బాబునాగేంద్ర, బీఎస్ నారాయణభట్టు, సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు.

వినాయకచవితి ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, భోగిరెడ్డి రమేష్‌రెడ్డి, పెద్ది శ్రీనివాసరావు, ఉత్సవకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 16: పిట్టలవానిపాలెం బెలెండ్‌సెంటర్లో ఉన్న శ్రీసిద్ధి గణపతి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గణపతిస్వామి కల్యాణ మహోత్సవాలను నిర్వహించి స్వామిని పురవీధుల్లో మేళతాళాలతో, కనకతప్పెట్లతో ఊరేగించారు. అనంతరం నిమజ్జనం చేశారు.

● ఖాజీపాలెం గ్రామపంచాయతీలోని శ్రీకాశీవిశ్వనాధస్వామి దేవస్థానం నందు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ఆలయకమిటీ సభ్యులు సోమవారం గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనం చేశారు.

వేమూరు, సెప్టెంబరు 16 : వేమూరులో కొలువుదీరిన సిద్ధి బుద్ధి సమేత శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో వార్షికంగా నిర్వహించే గణపతి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌పై అలంకరించి గ్రామంలో ఊరేగించి గాజుల్లంకలో నిమజ్జనం చేశారు.

అమృతలూరు, సెప్టెంబరు 16: శివాలయంలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని మోపర్రులో నిమజ్జనం చేశారు.

గణేష్ లడ్డును రూ.1.40వేలకు దక్కించుకున్న సుజన్

రేపల్లె, సెప్టెంబరు 16: మండలంలోని కైతేపల్లిలో గ్రామస్తులు ఏర్పాటు చేసిన వినాయక చవితి పందిళ్ళల్లో సోమవారం కమిటీ సభ్యులు వేలం పాటను నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన అల్లపర్తి సుజన్ రూ.1.40వేలకు దక్కించుకున్నాడు.

బీజేపీ సభ్యత్వం ప్రతిఒక్కరు తీసుకోవాలి

రాష్ట్ర అధికార ప్రతినిధి, జోనల్ ఇన్‌చార్జి వల్లూరి జయప్రకాష్



సమావేశంలో మాట్లాడుతున్న వల్లూరి జయప్రకాష్

బాపట్ల, సెప్టెంబరు 16 : బీజేపీ సభ్యత్వం ప్రతి ఒక్కరు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, జోనల్ ఇన్‌చార్జి వల్లూరి జయప్రకాష్ కోరారు. బాపట్ల జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ అధ్యక్షతన సోమవారం సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించారు. సమావేశానికి జయప్రకాష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 15వేల పైచిలుకు సభ్యత్వాలు నమోదయ్యాయని పేర్కొన్నారు. సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొంటున్న ప్రతిఒక్కరికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మండల రామకృష్ణ, గణేష్‌బాబు, బండారుపల్లి హేమంత్‌కుమార్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు నాసిన మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ నాయకుల దాడి

● ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వంశీ



వంశీ కాళ్ళపై గాయాలు

చెరుకుపల్లి, సెప్టెంబరు 16: అధికారం మారినా ఆగని వైసీపీ కార్యకర్తల ఆగడాలకు టీడీపీ కార్యకర్తపై ఆదివారం రాత్రి జరిగిన దాడి నిదర్శనం. మండలంలోని గుళ్ళపల్లి గ్రామానికి చెందిన వంశీపై అదే గ్రామానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు వంశీ ఇంటిపై దాడి చేసి ఇష్టానుసారంగా కొట్టారని వంశీ ఆవేదన వ్యక్తం చేశారు. చేతికి, కాళ్లపై గాయాలు కావడంతో రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. అధికారులు స్పందించి దాడిచేసిన వారిని శిక్షించాలని కోరుతున్నాడు.

వాహనాలకు నెంబర్ ప్లేట్ తప్పనిసరి : సీఐ హరికృష్ణ

కర్లపాలెం, సెప్టెంబరు 16: వాహనాలన్నింటికి తప్పనిసరిగా నెంబర్ ప్లేట్ ఉండాలని వాటిపై జనరల్ బొమ్మలు, తదితరాలు కాకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం నెంబర్లు మాత్రమే ఉండాలని బాపట్ల రూరల్ సీఐ హరికృష్ణ అన్నారు. కర్లపాలెం బెలెండ్ సెంటర్‌లో సోమవారం సాయంత్రం కర్లపాలెం ఎస్ఐ రవీంద్రతో కలిసి వాహనదారులకు అవగాహన కల్పించారు.

వృద్ధురాలు ఆత్మహత్యాయత్నం

కర్లపాలెం, సెప్టెంబరు 16: మండలంలోని చింతాయపాలెం గ్రామానికి చెందిన అంగిరేకుల పున్నమ్మను (70) రెండు రోజులు నుంచి తన కుటుంబసభ్యులు కొట్టి చిత్ర హింసలకు గురి చేయటంతో చనిపోదామని నిశ్చయించుకున్నట్లు ఆమె పోలీసులకు తెలిపింది. బుద్దాం సమీపంలో ఉన్న తుంగభద్ర కాలువ వద్ద దూకటానికి వెళ్లగా ఆమెను చూసి ఆగ్రామ ఆక్వా రైతులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్ ఆమెను నిలువరించారు. ఎస్ఐ రవీంద్రకు సమాచారం తెలుపగా వెంటనే తన సిబ్బందిని అప్రమత్తం చేసి ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కుటుంబసభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తానని ఎస్ఐ హామీనిచ్చారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

బాపట్ల, సెప్టెంబరు 16: పట్టణంలోని ఏబీఎం హైస్కూల్ వీధిలో మహిళ నడుచుకుంటూ వెళుతుండగా పల్సర్ బైక్‌పై వచ్చిన వ్యక్తి మెడలోని మూడు సవర్ల గొలుసు లాక్కొని పలాయనం చిత్తగించాడు. సోమవారం జరిగిన ఈ సంఘటనపై బాధిత మహిళ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పట్టణ సీఐ అహ్మద్‌జానీ పోలీసులతో కలిసి వివరాలు సేకరిస్తున్నారు. ఆ ప్రాంతంలోని దుకాణాల వద్ద సీసీ పుటేజ్‌లు సేకరించి దొంగను పట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

లంక గ్రామాల్లో శాశ్వత డ్రైనేజీ ఏర్పాటు చేయాలి

● సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రమాదేవి

కొల్లూరు, సెప్టెంబరు 16 : వరదల సమయంలో నీరు పంటల్లో నిల్వ ఉండకుండా బయటకు వెళ్లేలా శాశ్వత డ్రైనేజీ ఏర్పాటు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డి.రమాదేవి డిమాండ్ చేశా రు. సోమవారం సాయంత్రం మండలపరిధిలోని కిష్కిందపాలెంలో నిర్వహించిన రైతు సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కృష్ణానది వరదల వల్ల రైతులు, కౌలు రైతులు కోట్లాది రూపాయల విలువైన వాణిజ్య పంటలు నష్టపోయారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వరదలు గ్రామాలను, పంటలను ముంచెత్తడం, వరద తగ్గినా లంక గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రైతులకు మరింత నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు వరదల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని స్థానిక ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో పోతార్లంక నుంచి పెసర్లంక వరకు శాశ్వత డ్రైనేజీ ఏర్పాటుకు కృషి చేయాల్సిన అవశ్యకత ఉందన్నారు. 2010లో డ్రైనేజీ ఇరిగేషన్ అధికారులు సిద్ధం చేసిన ప్రణాళికలు అమలు చేసేందుకు అధికారులు కూడా కృషి చేయాలన్నారు. రైతులందరూ ఐక్యతతో ఉండి శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు కోసం రాజకీయాలకు అతీతంగా కృషి చేస్తామని తీర్మానించారు. ప్రముఖ వ్యాపారవేత్త వేములపల్లి రవికిరణ్ మాట్లాడుతూ, ఇరిగేషన్ రాష్ట్ర స్థాయి అధికారి కార్యదర్శి లంక గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ గురించి పరిశీలించామన్నారు. డ్రైనేజీ వ్యవస్థ కోసం కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జొన్నా శివశంకర్, జిల్లా అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఏచూరి ఉద్యమ స్ఫూర్తిని ప్రతిఒక్కరూ పొందాలి

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మీ

బాపట్ల, సెప్టెంబరు 16 : విద్యార్థి దశ నుంచే కార్మికులు, కర్షకుల శ్రేయస్సే జీవిత లక్ష్యంగా శ్రమించిన మహనేత ఏచూరు సీతారాం ఉద్యమ స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ముందుకెళ్లాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మీ కోరారు. బాపట్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఏచూరి సంతాపసభ నిర్వహించారు. కార్యక్రమానికి ధనలక్ష్మీ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన పటానికి పుష్పాంజలి ఘటించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉద్యమాల నుంచి చరిత్రాత్మకమైన రైతాంగ నల్లచట్టాలు రద్దు వరకు, దేశంలో మతోన్మాదశక్తులు, కార్మికుల, ప్రజలను విచ్ఛిన్నం చేసే కుట్రలను తిప్పి కొట్టేందుకు సీతారాం ఎనలేని కృషి చేశారన్నారు. ఏచూరి బాటలో ప్రతి ఒక్కరు పయనించాలని కోరారు. ఏచూరి మరణం పీడిత ప్రజలకు తీరనిలోటు అన్నారు. ఆయన భౌతికకాయాన్ని కూడా వైద్య పరిశోధనల కోసం ముందుగానే ప్రజలకు అంకితం చేశారని తెలియజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్, కె.వసంతరావు, తిరుపతిరెడ్డి, కె.శరత్‌బాబు, జి.సుధాకర్, ఎం.వెంకటేశ్వరమ్మ, వీరాంజనేయులు, శ్రీనివాసు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నజీర్‌కు గోల్డ్‌మెడల్స్

బాపట్ల, సెప్టెంబరు 16: ఆంధ్రప్రదేశ్ 11వ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బాపట్ల క్రీడాకారుడు షేక్.నజీర్ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రెండు గోల్డ్‌మెడల్స్ సాధించారు. అమలాపురంలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు ఆఫీసర్స్ క్లబ్ నందు నిర్వహించిన మాస్టర్స్ విభాగంలో 70కేజీల బరువు విభాగంలో ప్రథమ స్థానం సాధించి గోల్డ్ మెడల్ సొంతం చేసుకున్నాడు. బెంచి విభాగంలో కూడా ప్రతిభ కనబరిచి మరో గోల్డ్‌మెడల్ సాధించాడు. గోల్డ్‌మెడల్స్ సాధించిన నజీర్‌ను క్రీడాకారులు, క్రీడాభిమానులు, ప్రముఖులు అభినందించారు.

ఏరియా వైద్యశాలలో నేడు అమెరికా వైద్యుల శిబిరం

బాపట్ల, సెప్టెంబరు 16: బాపట్ల ఏరియా వైద్యశాలలో మంగళవారం ఉద యం 10నుంచి 12.30 గంటల వరకు అమెరికా న్యూరాలజిస్ట్ డాక్టర్ తేజానంద్ గౌతమ్ ములుపూరి ప్రత్యేక శిబిరం ద్వారా వైద్యసేవలందించినున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ తెలిపారు.

విశ్రాంత సైనికులకు సత్కారం

బాపట్ల, సెప్టెంబరు 16 : రాష్ట్ర స్థాయిలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న జిల్లా విశ్రాంత సైనిక సంక్షేమ సంఘం విశ్రాంత సైనికులకు సోమవారం సర్టిఫికెట్లు, జ్ఞాపికలను ఎమ్మెల్యే నరేంద్రవర్మ అందజేశారు. స్థానిక మాజీ సైనిక సంక్షేమ సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సాంబశివరావు ఆధ్వర్యంలో వారిని సత్కరించారు.

బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ



చింతల్లంకలో నిత్యావసర సరుకులను బాధితులకు అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, సెప్టెంబరు 16: ఎన్నారై అందించిన నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే ఆనందబాబు బాధితులకు అందజేశారు. సోమవారం మండలపరిధిలోని చింతల్లంకలో వేమూరు లక్ష్మయ్య జ్ఞాపకార్థం ఆయన మనుమడు ప్రవాసాంధ్రుడు అరవింద్ 510 మంది బాధితులకు నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేయించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, నాయకులు కోగంటి శివవెంకటేశ్వరరావు, కోగంటి సాంబశివరావు, మున్నంగి విజయ్, గుమ్మడి సుధీర్, శిగిలిశెట్టి రాఘవరావు పాల్గొన్నారు.

100 కుటుంబాలకు జనసేన నాయకుడి సాయం

కొల్లూరు, సెప్టెంబరు 16: బాధితులకు జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు సోడాబత్తుల శివరావు తన వంతు సాయం అందించారు. గుంటూరు లాల్‌పురంకు చెందిన జనసేన నాయకుడు శివరావు ఈపూరులంక, సుగ్గునలంక, కనిగిరి లంక, చిలుమూరు లంక గ్రామాల్లోని 100 కుటుంబాలకు నెల రోజులకు సరిపడా నిత్యవసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వడ్డి రత్తయ్య, శంకర్ మాస్టర్, నీలం సుబ్బారావు, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

నా గ్రామానికి నా భరోసా పేరుతో సాయం

కొల్లూరు, సెప్టెంబరు 16: జన్మనిచ్చిన ఊరు వరద ముంపునకు గురై నిరాశ్రయులైన వారిని ఆ గ్రామానికి చెందిన ఉద్యోగులు ఆపన్న హస్తం అందించారు. సోమవారం తోకలవానిపాలెంలో అదే గ్రామానికి చెందిన వారు ఇతర ప్రాంతాల్లో చిరు ఉద్యోగాలు చేస్తూ తమ వారికి వచ్చిన ఆపదను తెలుసుకుని తాముస్నమంటూ ముందుకు వచ్చి నా గ్రామానికి నా భరోసా పేరుతో రూ.2 లక్షల విలువైన వస్తువులు, నిత్యవసరాలు పంపిణీ చేసి అండగా నిలిచారు.

లిటిల్ హార్ట్స్ విద్యార్థుల చేయూత

భట్టిప్రోలు, (కొల్లూరు), సెప్టెంబరు 16: బాధితులకు లిటిల్ హార్ట్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు చేయూతనిచ్చారు. సోమవారం మండలపరిధిలోని పెదలంక గ్రామంలో 40 కుటుంబాలకు నిత్యావసర సరుకులను స్కూల్ కరస్పాండెంట్ పార్థసారధి అందించారు. కార్యక్రమంలో విద్యాసంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఈరే మినిస్ట్రీస్ సంస్థ దుస్తులు, నిత్యావసరాల పంపిణీ

భట్టిప్రోలు, కొల్లూరు, సెప్టెంబరు 16: వరద ప్రభావిత లంక గ్రామాల్లోని బాధితులకు ఈరే మినిస్ట్రీస్ సంస్థ దుస్తులు, నిత్యావసర సరుకులు అందజేశారు. సోమవారం కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని పెదలంక, తిప్పలకట్ట గ్రామాల్లో బాధితులకు సంస్థ డైరెక్టర్ కె.సుధీర్‌కుమార్ పంపిణీ చేశారు.

లంక గ్రామాల్లో ప్రైవేట్ ఉపాధ్యాయులకు చేయూత

భట్టిప్రోలు, (కొల్లూరు), సెప్టెంబరు 16: వరద ప్రభావిత ప్రాంతాల్లోని విద్యా సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులకు అపుస్మా ఆధ్వర్యంలో చేయూత అందించారు. మండలపరిధిలోని పెదలంక గ్రామంలోని ఓ విద్యా సంస్థ ఉపాధ్యాయులుగా పని చేస్తున్న 40 మంది అపుస్మా బాపట్ల జిల్లా అధ్యక్షుడు ఎంవీ రావు, కార్యదర్శి రవి శంకర్, కోశాధికారి నాగేశ్వరరావు, దుస్తులు, నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల వరదల్లో భట్టిప్రోలు, రేపల్లె, కొల్లూరు మండలాల్లోని ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను ఆదుకునేందుకు రూ.1.08 లక్షల విరాళాలు సేకరించి ఈ సాయం అందించారన్నారు. .

వరద భాధితులకు సాల్వేషన్ ఆర్మీ కిట్లు పంపిణీ

బాపట్ల, సెప్టెంబరు 16 : విజయవాడలోని వరద బాధితులకు సాల్వేషన్ ఆర్మీ బాపట్ల మండల నాయకులు సోమవారం కిట్లు పంపిణీ చేశారు. రామకృష్ణాపురం, సింగ్‌నగర్, మిల్క్ ప్రాజెక్ట్ ప్రాంతాల్లో సాల్వేషన్ ఆర్మీ డివిజన్ కమాండర్ గేరా థామస్ ఆధ్వర్యంలో సభ్యులు పర్యటించారు. బాధిత కుటుంబాల వారికి వంట సామగ్రి, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కాగిత వరప్రసాదరావు, కాగిత సుందరదాసు, గేరా మణిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.


పశు పోషకులకు దాణా పంపిణీ



ఆవులవారిపాలెంలో పశుదాణాను అందిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కొల్లూరు, సెప్టెంబరు 16 : వరద ప్రభావిత లంక గ్రామాల్లో పశు పోషకులకు సీపీఐ ఆధ్వర్యంలో దాణా పంపిణీ చేశారు. సోమవారం మండల పరిధిలోని ఆవులవారిపాలెంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జల్లి విల్సన్, అక్కినేని వనజ, సంఘ అధ్యక్షుడు ఈశ్వరన్ తదితరులు పర్యటించి వరద బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ వరద వల్ల వాణిజ్య పంటలతో పాటు పశుగ్రాసం కూడా కొట్టుకుపోయాయన్నారు. మూగజీవాలను రక్షించుకునేందుకు సీపీఐ ఆధ్వర్యంలో పశు పోషకులకు దాణా అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు, వరదల వల్ల సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు పార్టీ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి ఆయా ప్రాంతాల్లో బాధితులకు నిత్యావసరాలు, పశుదాణా పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, జిల్లా కౌన్సెలింగ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యలంక తీరంలో ఫైనాన్స్ వ్యాపారి దారుణ హత్య



బాచు ఏసుబాబు (ఫైల్‌ఫొటో)

బాపట్ల, సెప్టెంబరు 16 : ఫైనాన్స్ తీసుకున్న డబ్బులు ఇస్తామని పిలిచి మరి దారుణంగా హత్య చేసిన ఘటన బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరంలో సోమవారం సాయంత్రం జరిగింది. బాపట్లలో తీవ్ర కలకలంరేపిన ఈ ఘట న వివరాలు ఈవిధంగా ఉన్నాయి. కృష్ణా జిల్లాకు చెందిన బాచు ఏసుబాబు సుమారు 10ఏళ్ళ నుంచి బాపట్ల పట్టణంలోని కారుమూరి హనుమంతరావు కాలనీలో ఉంటూ ఫైనాన్స్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో కొందరు ఫోన్ చేసి డబ్బులిస్తామని సూర్యలంక పిలిపించారు. ఏసుబాబు తన అసిస్టెంట్ చంద్రశేఖర్ అలియాస్ చిన్నితో కలిసి సూర్యలంక వెళ్లగా కుందేరు వాగు చప్టాపై కొందరు వ్యక్తులు కత్తులతో దాడి చేసి పీక కోశారు. దీంతో ఏసుబాబు అసిస్టెంట్ పారిపోయాడు. ఏసుబాబు రక్తంకారుకుంటూనే బైక్‌పై సూర్యలంక శివాలయం దగ్గరకెళ్ళి జరిగిన విషయం కొంత వరకు చెప్పినట్లు సమాచారం. ఏసుబాబు కొనఊపిరితో ఉండగా పోలీసులు 108 అంబు లెన్స్‌లో ఏరియావైద్యశాలకు తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈమేరకు రూరల్ సీఐ గంగాధరరావు ఆధ్వర్యంలో పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడి అసిస్టెంట్ చంద్రశేఖర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. హత్య జరిగిన తర్వాత తెలియని వ్యక్తులు మృతుడి భార్యకు ఫోన్ చేసి చెప్పినట్లు సమాచారం.

డబ్బులు ఇస్తామని పిలిచి చంపారు : మృతుడి భార్య అమ్ములు

ఫైనాన్స్ తీసుకున్న డబ్బులు ఇస్తామని ఆదర్శనగర్‌కు చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి పిలిచి ఈవిధంగా హత్య చేశారని మృతుడి భార్య అమ్ములు తెలిపారు. ఏసుబాబుకు ఫోన్ చేసి పిలవటంతో వెళ్లాడని కొంత సమయం తర్వాత హత్య చేసినట్లు తెలిసిందని కన్నీరు మున్నీరుగా విలపించ సాగింది.

దళిత గిరిజనుల అభ్యున్నతికి సహకరించాలని వినతి

బాపట్ల, సెప్టెంబరు 16: దళిత గిరిజనుల అభ్యున్నతికి సహకరించాలని కోరుతూ బడ్జెట్ వాచ్ జిల్లా కమిటీ సభ్యులు సోమవారం ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నలమాల తిరుపతిరావు, జిల్లా చైర్మన్ దేవరపల్లి డేవిడ్ రాజు.కన్వీనర్ దార్ల కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బాలుర అండర్14 క్రికెట్ జట్టుతో అసోసియేషన్ సభ్యులు

అండర్ 14 జిల్లా జట్టు ఎంపిక

మేదరమెట్ల, సెప్టెంబరు 16: ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర అండర్-14 జిల్లా స్థాయి సెలెక్షన్స్ కొరిశపాడు మండలం రావినూతలలోని రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ స్టేడియంలో ఆది, సోమవారాల్లో నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన 33 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. వారికి రెండు రోజులు నిర్వహించిన క్రికెట్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 16మందిని స్టాండ్‌బైగా ఐదుగురికి అండర్14 జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపిక అయిన క్రీడాకారులు అక్టోబరు 1వతేదీ నుంచి జరిగే అంతర్ జిల్లా క్రికెట్ పోటీలలో పాల్గొంటారని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కారసాల నాగేశ్వరరావు(బాబు) తెలియజేశారు. రెండు రోజుల పాటు జరిగిన పోటీలలో సెలెక్టర్లుగా మాజీ రంజీ ప్లేయర్ తాటికొండ వంశీకృష్ణ, మాజీ రాష్ట్ర క్రీడాకారుడు శ్రీకృష్ణ విజయకుమార్‌లు వ్యవహరించారు. కోచ్‌లుగా సుధాకర్, చంద్రశేఖర్‌లు హాజరయ్యారు. సెలెక్టర్ వంశీకృష్ణ, గ్రౌండ్ మ్యాన్ అజయ్‌కు ఈ సందర్భంగా క్రీడాకారులు చిరు సన్మానం చేశారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.మోహన్‌దాస్, సభ్యులు కొల్లా మధు, సాయికృష్ణ, ఆర్ఎస్‌సీఏ సభ్యులు శేష తదితరులు పాల్గొన్నారు.

కనపర్తి ఎత్తిపోతల పథకాన్ని అభివృద్ధి చేస్తా

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్



మోటార్లు ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బీఎన్

నాగులుప్పలపాడు సెప్టెంబరు 16: కనపర్తి ఎత్తిపోతల పథకాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. అమ్మనబ్రోలు వద్దనున్న కనపర్తి ఎత్తిపోతల పథకం వద్ద ఆయకట్టు రైతుల సాగు అవసరాల కోసం సోమవారం ఎమ్మెల్యే మోటార్లు ఆన్‌చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు ఈదర వెంకటకృష్ణారావు అధ్యక్షతన జరిగిన సభలో ముందుగా ఏవో వెంకటరావు మాట్లాడుతూ రైతులు సాగు చేసిన వరి పంటను అమ్ముకొనేందుకు వీలుగా ప్రభుత్వం రెండవ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి మద్దతు ధరను అందిస్తుందని చెప్పారు. మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి మాట్లాడుతూ రాష్ట్రంలోనే నాలుగు సార్లు ఆదర్శ అవార్డులను అందుకొన్న కనపర్తి ఎత్తిపోతల పథకం మోటార్లు, ప్యానళ్లు దెబ్బతిన్నాయని, ఆనాడు గుండ్లకమ్మ డ్యాం నిర్మించిన సమయంలో సాగునీటి వాటా అందించేలా (డీపీఆర్)లో చేర్చలేదని చెప్పారు. దీంతో గుండ్లకమ్మ డ్యాం గేట్లు మూసివేసిన సమయంలో నదిలో నీరు లేక పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. అంతేగాకుండా పథకం కాలువ కట్టలు దెబ్బతిని పంట ఉత్పత్తులు ట్రాక్టర్లలో తరలించే సమయంలో రైతులు ఇబ్బందిపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎత్తిపోతల పథకం డీపీఆర్‌లో చేర్చాలని, కాలువ కట్టలపై గ్రావెల్ పరిచి, అధునాతన మోటార్లను మంజూరు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా అంశాలపై ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ కనపర్తి ఎత్తిపోతల పథకంపై తనకెంతో మక్కువ ఉందన్నారు. దీనిని డీపీఆర్‌లో చేర్చడం కొంత కష్టంతో కూడుకొన్న పని అయినా రైతుల శ్రేయస్సు కోసం నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సాగునీరు వాటా అందేలా చేస్తానన్నారు. కాలువ కట్టలపై గ్రావెలు రోడ్డు నిర్మించుకొనేందుకు వెంటనే నిధులు సమకూర్చనున్నట్లు తెలిపారు. అత్యాధునిక మోటార్లు ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తానన్నారు. నూతనంగా ఎన్నికైన ఎత్తిపోతల పథకం కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బీఎన్‌ను, వీరయ్యచౌదరిలను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, నాయకులు దివి పున్నారావు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ఎస్‌ఐల బదిలీలు

10 మందికి పోస్టింగ్, ముగ్గురు వీఆర్‌కు

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 16: జిల్లాలో ఎట్టకేలకు ఎస్సైల బదిలీలు చేపట్టారు. పది మందికి పోస్టింగు ఇచ్చి, ముగ్గురిని వీఆర్‌కు పిలిచారు. బదిలీలు అన్నీ పశ్చిమప్రాంతంలోనివే కావడం విశేషం. ఇంకా కొంతమందికి రెండు మూడు రోజులలో స్థానచలనం ఉంటుందని సమాచారం. అదే విధంగా ర్యాంకర్ ఎస్సైలు కూడా పోస్టింగ్‌ల కోసం ఎదురుచూస్తున్నారు.

సూక్ష్మసేద్యానికి జవసత్వాలు

ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ సర్కార్

మొదటి మూడేళ్లు నిలిపివేత, ఆ తర్వాత

రెండేళ్లు మొక్కుబడిగా అమలు

రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.160 కోట్లలో

ఒక్క రూపాయి కూడా ఇవ్వని వైనం

గత టీడీపీ హయాంలో పెద్ద ఎత్తున అమలు

బాబు జమానా ఐదేళ్లలో రూ.362 కోట్లు ఖర్చు

మళ్లీ దృష్టిసారించిన కూటమి ప్రభుత్వం

ఒంగోలు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అరకొర సాగునీటి వనరులతో అవస్థలు పడే రైతాంగానికి ఎంతో మేలు చేసేది సూక్ష్మ సాగునీటి పథకం. అందులో సగం వాటా నిధులు కేంద్రం నుంచి వస్తాయి. మిగతావి రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలి. ఈ పథకం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేస్తారు. అలాంటి అద్భుత పథకాన్ని గత వైసీపీ ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేసింది. అసలు పథకం గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. రైతులు గగ్గోలు పెట్టినా స్పందించలేదు. అయితే గతంలో 2014-19లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం విస్తారంగా అమలుచేసింది. రాయలసీమ ప్రాంతంతో సమానంగా జిల్లాలోని రైతులకు 90శాతం సబ్సిడీపై బిందు, తుంపర సేద్యం పరికరాలను అందించింది. ఐదేళ్ల టీడీపీ ప్రభుత్వ కాలంలో ఈ పథకం కింద 46,134 మంది రైతులకు సుమారు రూ.362కోట్లతో పరికరాలు అందించి 51,301 హెక్టార్లలో సాగు కల్పించింది. వివిధ రకాల పండ్లతోటలు మిర్చి ఇతర ఆరుతడి పంటలను రైతులు సాగు చేశారు.

అరకొరగా అమలు.. రాయితీలోనూ కోత

కాగా 2019-24 మధ్య ఐదేళ్లకు మరో లక్షన్నర హెక్టార్లలో ఈ పథకం విస్తరణకు టీడీపీ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. అయితే జిల్లాలో రైతాంగానికి ఎంతో ఉపకరించే ఈ పథకాన్ని 2019లో అధికారంలోకి రాగానే వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. తొలి మూడేళ్లు ఆ ఊసే ఎత్తలేదు. అలా రాష్ట్రవ్యాప్తంగా సూక్ష్మ సేద్యం పథకాన్ని నిలిపివేయడంపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో 2022-23లో మళ్లీ ప్రారంభించింది. ఆ ఏడాది సగం సాగుకాలం ముగిశాక అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. జిల్లాకు ఆ ఏడాది తొలుత 16వేల హెక్టార్లకు అనుమతి ఇచ్చారు. అలాగే 2023-24లో కూడా 9,540 హెక్టార్లకు మంజూరుచేశారు. అలా రెండేళ్లలో 17,740 హెక్టార్లకు మాత్రమే ఈ పథకాన్ని అమలు కాగా గత టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన 90శాతం రాయితీని మాత్రం అమలు చేయలేదు. ఇదిలాఉండగా వైసీపీ ప్రభుత్వం ఆ రెండేళ్లలో మైక్రో ఇరిగేషన్ పథకం అమలుకు సంబంధించి రైతుల వాటా రూ.41 కోట్లు, ప్రభుత్వ వాటా రూ.160 కోట్లు కాగా పరికరాలు అందించిన కంపెనీలకు కేవలం రైతుల వాటా నగదు మాత్రమే జమైంది. ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.160కోట్లలో ఒక్క రూపాయి కూడా ఇచ్చిన పాపాన పోలేదు. అలా రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.1,165 కోట్ల మేర పెండింగ్ పెట్టింది.

ఏపీ మైక్రో (సూక్ష్మ) సాగునీటి పథకాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. జిల్లా రైతాంగానికి ప్రత్యేకించి పశ్చిమ ప్రాంతంలో బోర్ల కింద పంటల సాగు చేసే రైతులకు ఎంతో ఉపకరించిన సూక్ష్మసేద్యం అందని ద్రాక్షాలనే మిగిలింది. ఆ ఐదేళ్లలో మూడేళ్లు పథకాన్ని నిలిపివేయగా మరో రెండేళ్లు మొక్కుబడిగా అమలుచేసినా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. పైగా రాయితీలోనూ కోత పెట్టింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహత్తర పథకంపై దృష్టిపెట్టింది. క్షేత్రస్థాయిలో పరిస్థితిని అధ్యయనం చేస్తోంది. ఆయా కంపెనీలతో మాట్లాడి పరికరాలు అందించేందుకు అంతా సిద్ధం చేస్తోంది.



స్ప్రింకర్లతో సాగు చేస్తున్న రైతు

కంపెనీలకు భరోసాతో ముందుకు..

దీంతో ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం మళ్లీ ఈ పథకానికి జీవసత్వాలు కల్పించే చర్యలు చేపట్టినా వైసీపీ ప్రభుత్వం చెల్లించకుండా నిలిపేసిన పెండింగ్ బకాయిలు ప్రతిబంధకంగా మారాయి. ఈ విషయాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెండింగ్ బకాయిలపై కంపెనీలకు భరోసా ఇచ్చారు. తొలిగా ఇటీవల రూ.176 కోట్లు విడుదల చేశారు. మిగిలిన వాటిని విడతల వారీగా చెల్లించేలా హామీ ఇచ్చారు. ఈ ఏడాది మళ్లీ భారీగా సూక్ష్మ సేద్యం అమలుకు సహకరించాలని కంపెనీలకు సూచించారు. దీంతో వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన మైక్రో ఇరిగేషన్ పథకం తిరిగి పునరుజ్జీవనం పొందనుంది. అందుకు సంబంధించిన ప్రక్రియను ప్రస్తుతం సంబంధిత అధికారులు చేపట్టారు.

రైతులకు సూక్ష్మసేద్య పరికరాలు

- కొత్తపట్నం, టంగుటూరు మండలాల్లో సూక్ష్మసేద్యం క్షేత్రాలను పరిశీలించిన డైరెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 16: రైతులు కొత్తగా సూక్ష్మ సేద్య పరికరాల కోసం దరఖాస్తు చేసుకుంటే వారికి అవసరమైనర పరికరాలను వెంటనే అందజేస్తామని ఉద్యానవన శాఖ డైరెక్టర్ డాక్టర్ కే.శ్రీనివాసులు అన్నారు. కొత్తపట్నం, టంగుటూరు మండలాల్లో సోమవారం ఉద్యాన, సూక్ష్మసేద్య క్షేత్రాలను ఆయన పరిశీలించారు. ముందుగా కొత్తపట్నం మండలం ఈతముక్కలలో కూరగాయలు, ఇతర పంటలకు అమర్చిన సూక్ష్మ సేద్య పరికరాలను పరిశీలించారు. అక్కడి రైతులను అడిగి పలు అంశాలను తెలుసుకున్నారు. అనంతరం టంగుటూరు మండలం కందులూరులో సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం ద్వారా అమలు చేసిన ఉద్యాన పంటల విస్తరణ పథకంలో భాగంగా నాటిన నిమ్మతోట (మూడేళ్ల)ను సందర్శించారు. రైతు రామారావుకు అందించిన రాయితీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు కృష్ణారాజు, రంగారావు లు ఇచ్చిన సూచనలు, సలహాలపై పదిరోజుల్లో ఒక నివేదికను అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సూక్ష్మసేద్య పథకం సంచాలకులు పీవీ.రమణయ్య, జిల్లా ఉద్యానవన అధికారి గోపిచంద్, ఉద్యాన అధికారి ఎం.లక్ష్మి, కొత్తపట్నం హెచ్ఓ తేజ, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సూక్ష్మసేద్యం క్షేత్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీనివాసులు

వరద విరాళాల్లో గోల్‌మాల్

డీఈవో కార్యాలయం అవినీతిమయం

సీఎంకు ఫిర్యాదు చేసిన టీఎన్‌యూఎస్

సమగ్ర విచారణకు వినతి

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 16: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం వసూలు చేసిన విరాళాల్లో కొంత మొత్తం గోల్‌మాల్ అయినట్లు ఆరోపణలు నెలకొన్నాయి. జిల్లాలో వరద బాధితులను ఆదుకునేందుకు జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర మండల విద్యాధికారులు, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు, ఉప విద్యాధికారుల ద్వారా విరాళాలు వసూలు చేశారు. అయితే జిల్లా విద్యాశాఖ ద్వారా ఎవరెవరి నుంచి ఎంత మొత్తం వసూలు చేసింది? ఆ నిధులను ఏమి చేసింది గోప్యంగా ఉంచారు. దీంతో ఈ నిధుల విషయంలో డీఈఓ సుభద్ర అవినీతికి పాల్పడినట్లు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆరోపించారు. ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేశారు. వరద బాధితుల విరాళాలు గోల్‌మాల్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు ఆ ఫిర్యాదులో సీఎంకు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌కు, పాఠశాల విద్యా గుంటూరు ఆర్జేడీకి వారు ఫిర్యాదు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.



డీఈవో అవినీతి ఇలా...

డీఈవో కార్యాలయంలో కూడా అవినీతి వేళ్లూనుకుపోయిందని, నిధుల స్వాహాపై సమగ్ర విచారణ చేయాలి.

-ప్రజాప్రతినిధుల సిఫార్సులను పక్కనపెట్టి కొందరు టీచర్ల వద్ద భారీ మొత్తాలను వసూలు చేసి డీఈవో కార్యాలయంలో, సమగ్రశిక్ష కార్యాలయంలో డిప్యుటేషన్లు వేశారు. ప్రజాప్రతినిధులు బెబితే నిబంధనలు అంగీకరించబోవని చెప్తున్న డీఈవో ఏ నిబంధనల ప్రకారం వీరికి డిప్యుటేషన్లు వేశారో విచారణ జరిపి నిగ్గుతేల్చాలి.

- ఉపాధ్యాయ దిన వేడుకల్లో కొందరు అనర్హుల నుంచి రూ.10వేల నుంచి రూ.20వేల వరకు వసూలు చేసి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇచ్చారు. దీనిపై విచారణ చేయాలి.

- ఉద్యోగోన్నతులు తీసుకున్న ఉపాధ్యాయులు కొందరు వివిధ కారణాలతో తిరిగి పాత పోస్టుకు పోయేందుకు రివర్షన్లకు దరఖాస్తు చేస్తే వారి వద్ద నుంచి రూ.70వేల నుంచి రూ.80వేల వరకు వసూలు చేశారు.

-డీఈవో కార్యాలయం ఐటీ సెల్‌లో మూడు పోస్టులలో నియమించేందుకు మూడో కంటికి తెలియకుండా ముగ్గురు టీచర్ల పేర్లు పాఠశాల విద్యా కార్యాలయానికి ఆన్‌లైన్‌లో ఫైల్ పంపారు. ఈ వ్యవహారంలో భారీమొత్తం చేతులు మారినట్లు వారు ఆరోపించారు.

- పాఠశాల ప్రారంభ అనుమతులు, ప్రభుత్వ గుర్తింపునకు భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారు. ఈ విషయాన్నింటిపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని టీఎన్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, రామశెట్టి వెంకటేశ్వర్లులు కోరారు.

రోడ్డెక్కుతున్న ప్రభుత్వ వైద్యులు

నేడు చలో విజయవాడకు వెళ్లనున్న డాక్టర్లు

విజయవాడ ధర్నా అనంతరం తదుపరి కార్యాచరణ

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 16: పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీసు కోటాను తగ్గించడాన్ని నిరసిస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు తమ ఆందోళనను ఉధృతం చేస్తున్నారు. గత వారంరోజుల నుంచి వివిధ రూపాల్లో నిరసనలు తెలిపారు. కాగా ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో వైద్యులు మంగళవారం చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టారు. పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యులకు పీజీ ఉన్నత విద్యను అందించేందుకు ఇన్ సర్వీసు కింద 30శాతం కోటా ఉండేది. అయితే ఆ కోటాను 15 శాతానికి తగ్గిస్తూ ప్రభుత్వం ఇటీవల జీవో నెంబరు 85 జారీ చేసింది. ఈ జీవోకు వ్యతిరేకంగా గత వారంరోజుల నుంచి నల్లబ్యాడ్జిలు ధరించి నిరసనతోపాటు మూడు రోజుల పాటు ఓపీలను బహిష్కరించారు. అయితే ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోవడంతో మంగళవారం ఛలో విజయవాడకు రాష్ట్ర కమిటీ పిలుపునివ్వడంతో జిల్లా నలుమూలల నుంచి వైద్యాధికారులు ఆ కార్యక్రమానికి హాజరుకానున్నారు. వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా చేయనున్నారు. అప్పటికి కూడా ప్రభుత్వం నుంచి సానుకూలంగా స్పందించి జీవోను రద్దుచేయకపోతే తదుపరి కార్యచరణ ప్రణాళికను అక్కడే ప్రకటించనున్నారు. ఆ ప్రకారం జిల్లావ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాహుల్ తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 16: పేకాట శిబిరాలపై పోలీసులు దాడులుచేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.1650 నగదును స్వాధీనం చేసుకు న్నారు. ఈఘటన సోమవారం మండలంలోని యడవల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై వి.మహేశ్ తెలిపిన వివరాల మేరకు.. పేకాట ఆడుతున్నట్టు సమాచారంతో సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. పేకాటరాయు ళ్లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సాగునీటి రంగంపై దృష్టిసారించాలి

మంత్రిని కలిసి కోరిన రైతుసంఘాల ప్రతినిధులు

వివిధ అంశాలపై స్వామికి వినతిపత్రం

ఒంగోలు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వపరంగా ప్రత్యేకదృష్టి సారించాలని వివిధ రైతుసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రస్తుతం సాగునీటి అవసరాలు, ప్రాజెక్టుల పూర్తిపై సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు నేతృత్వంలో వివిధ సంఘాల ప్రతినిధులు మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామిని సోమవారం తూర్పునాయుడుపాలెంలో కలిశారు. వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం వరినాట్ల సీజన్ కాగా సాగర్ కుడి కాలువ ద్వారా జిల్లాకు రావాల్సిన వాటా మేర నీరు వచ్చేలా చేయాలని కోరారు. తక్షణం ఆయకట్టుకు పూర్తిస్థాయిలో వరి సాగుకు వీలుగా నీటి సరఫరా అవసరంగా పేర్కొన్నారు. ఈ అంశాలను చర్చించేందుకు తక్షణం జిల్లాస్థాయి సమావేశాన్ని అధికారికంగా నిర్వహించాలన్నారు. అలాగే గుండ్లకమ్మ అన్ని గేట్లకు మరమ్మతులు చేసి రబీకి నీరివ్వాలని కోరారు. వెలిగొండ పూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు. కొండపి నియోజకవర్గంతో పాటు పొదిలి మండలాన్ని అటు వెలిగొండ నీరు, ఇటు సాగర్ నీరుకు అనుసంధానం చేయడం ద్వారా భవిష్యత్‌లో ఈ ప్రాంతంలోని మెట్ట భూములకు సాగు నీరు శాశ్వతంగా అందేలా చూడాలన్నారు. మంత్రి స్వామి స్పందిస్తూ ప్రభుత్వపరంగా రైతాంగానికి మేలు జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి స్వామిని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి పొలవరపు వెంకట్రామయ్య, రైతు సంఘాల ప్రతినిధులు పమిడి వెంకట్రావు, కే వీరారెడ్డి, వి.సుబ్బారావు, కే.ఆంజనేయులు, మండవ శ్రీనివాసరావు, షేక్ మాబు, సీహెచ్ సుధాకరరావు ఉన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘాల నాయకులు

సాగర్ ఆయకట్టులో ముమ్మరంగా వరి నాట్లు











సాగర్ ఆయకట్టు కింద రైతులు వరి నాట్లు వేయడం ప్రారంభించారు. నీరు వచ్చి కొద్ది కాలమే అయినా నారు కొనుగోలు చేసి నాట్లు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతు కూలీలకు డిమాండ్ పెరిగిపోయింది. అన్ని రకాల వ్యవసాయ పనులు ఒకేసారి రావడంతో కూలి రేట్లు కూడా పెరిగిపోయాయి. కురిచేడు మండలంలో సాగర్ ఆయకట్టు కింద అధికారికంగా 7 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అనధికారికంగా మరో 3 వేల ఎకరాలలో వరి సాగు చేస్తున్నారు. మొత్తం మీద 10 వేల ఎకరాలలో వరి సాగు చేస్తున్నారు. గుంటూరు జిల్లా నూజెండ్ల మండలం ఐనవోలు వద్ద వరినారును కొనుగోలు చేసి తెస్తున్నారు. ప్రస్తుతం దీర్ఘకాలిక వరి వంగడం బీపీటీ రకం నాటుతున్నారు. గతేడాది తీవ్ర కరువు వల్ల మాగాణి సాగు లేకపోవడం, ఈ ఏడాది సాగర్ నీరు ముందస్తుగా రావడంతో పంటలు వెంటనే సాగు చేయడానికి రైతులు ఉద్యుక్తులయ్యారు. ఈ ఏడాది రెండు పంటలు సాగుచేయాలనేది రైతుల లక్ష్యంగా కనపడుతున్నది.

-కురిచేడు


కల్యాణం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అంగరంగ వైభవంగా త్రివిక్రమస్వామి కల్యాణం

చెరుకూరు(పర్చూరు), సెప్టెంబరు 16: పర్చూరు మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలోని శ్రీ త్రివిక్రమ స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. తొలుత స్వామివార్లకు పవిత్రోత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో చేపట్టారు. అనంతరం వేద పండితుల సారథ్యంలో స్వామివారి కల్యాణ వేడుకలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.మాజీ జడ్పీటీసీ దాసరి ఉషారాణి దంపతులు పాల్గొని పూజలు చేశారు.


చెక్‌ను అందిస్తున్న బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అన్న క్యాంటీన్‌కు రూ.లక్ష విరాళం

- ఎమ్మెల్యే కొండయ్యకు చెక్కును అందించిన దాతలు

చీరాల, సెప్టెంబరు 16 : స్థానిక బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం అన్న క్యాంటీన్‌కు విరాళంగా రూ. లక్ష చెక్కును ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ పేదల ఆకలిని తీర్చేందుకు సీఎం చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్న క్యాంటీన్ నిర్వహణకు దాతలు తమవంతు సహకారం అందించటం హర్షణీయమన్నారు. తోటివారికి సాయపడాలనే తలంపుతో ముందుకొచ్చిన బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు తులాబంధు వెంకట సురేష్, వర్థికల నాగేశ్వరరావు, బి. స్వామి, ఊటుకూరి సత్యనారాయణ, జి. కృష్ణమోహన్, రామకృష్ణ, వాసు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాయపాలెం ఎత్తిపోతల సిద్ధం

పూర్తయిన మరమ్మతులు
కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు
హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు
త్వరలో మంత్రి గొట్టిపాటితో ప్రారంభం

అద్దంకి, సెప్టెంబరు16: రాష్ట్రంలోనే పురాతన ఎత్తిపోతల పథకాలలో ఒకటిగా ఉన్న తిమ్మాయపాలెం ఎత్తిపోతల పునఃప్రారంభానికి సిద్ధమైంది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సుమారు 6 కోట్ల రూపాయలతో పునర్ నిర్మాణం జరగగా సరైన నిర్వహణ లేక రెండు సంవత్సరాలుగా మూలన పడింది. గత ఏడాది ఎత్తిపోతల పథకం వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు పగులగొట్టి కాపర్ వైరు అపహరించుకు పోయారు. గత ఏడాది గుండ్లకమ్మ నదిలో నీటి ప్రవాహం కూడా లేక పోవటంతో పూర్తిగా మూలన పడింది. ప్రస్తుతం గుండ్లకమ్మ నదికి నీటి ప్రవాహం రావటంతో పాటు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి ట్రాన్స్‌ఫార్మర్ సమస్యను రైతులు తీసుకు పోవటంతో వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈఈ నల్లూరి మస్తాన్ రావు వెంటనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు. కొంతమంది రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కమిటీగా ఏర్పడి సుమారు 1.5 లక్షల రూపాయలు వెచ్చించి ప్యానెల్ బోర్డు ఏర్పాటు చేసుకున్నారు. అన్ని మరమ్మతులు పూర్తి కావటం, అందుబాటులో గుండ్లకమ్మ నదిలో నీరు ఉండటంతో త్వరలో మంత్రి రవికుమార్ ద్వారా ఎత్తిపోతల పథకాన్ని పునః ప్రారంభింప చేసేందుకు సిద్ధం చేశారు. రెండు సంవత్సరాల తరువాత ఆయకట్టులోని సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి రానుండటంతో తిమ్మాయపాలెం, రామాయపాలెం రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


తిమ్మాయపాలెం ఎత్తిపోతల పథకం

బైబై గణేశా..


నిమజ్జనానికి వాడరేవు తీరానికి తరలిస్తున్న వినాయక ప్రతిమ

భారీగా నిమజ్జనాలు

కొత్తపేట(చీరాల), సెప్టెంబరు 16 : వినాయక నిమజ్జనాల ఊరేగింపులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. స్థానిక ఓంకార క్షేత్రం ప్రాంతంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన పందిరిలో భారీ గణనాథుడిని కొలువుదీర్చారు. సోమవారం నిమజ్జనం చేసేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై, ప్రతిమను ట్రాక్టర్లో ఎక్కించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. తప్పెట్లు, బాణసంచా మోతలతో నగరోత్సవం కొనసాగింది. ఆద్యంతం భక్తులు జై బోలో గణేష్ మహారాజ్‌కి జై అంటూ నినాదాలు చేశారు. అనంతరం వాడరేవు సముద్ర తీరంలో గణనాథుడిని నిమజ్జనం చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


ముప్పవరంలో వినాయక నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న యువత

పంగులూరులో..

పంగులూరు :మండలంలో సోమవారం గణనాథునికి శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు, నిమజ్జన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.పంగులూరులోని బొబ్బగుంట మండపంలో కొలువుదీరిన గణనాథునికి మహిళలు, స్థానిక యువత పూజలు చేసి గంగ లో నిమజ్జనం చేసేందుకు ప్రత్యేక వాహనాలలో ఊరేగింపుగా తరలివెళ్ళారు. అలాగే ముప్పవరం గ్రామంలో గణనాథుని నిమజ్జన ఊరేగింపు కోలాహలంగా సాగింది.

ఇంకొల్లులో

ఇంకొల్లు : తొమ్మిదిరోజులపాటు పూజలందుకున్న గణనాథులను సోమవారం నిమజ్జనానికి తరలించారు.ఇంకొల్లు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలిన విగ్రహాలతో కోలాహల వాతావరణం నెలకొంది. స్థానిక రామమందిరం,ప్రసన్నాంజనేయ స్వామి గుడివద్ద ఏర్పాటు చేసిన విగ్రహాలను గ్రామంలో అత్యంత వైభవంగా ఊరేగింపు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. ఇంకొల్లులో విగ్రహ నిమజ్జనోత్సవంలో భాగంగా ఎన్టీఆర్‌పై అభిమానంతో ఆయన చిత్రపటాలతో పసుపు దుస్తులు ధరించి యువత సందడి చేసింది.


ఇంకొల్లులో వినూత్నంగా నిమజ్జనోత్సవంలో పాల్గొన్న యువత


గొర్లమిట్టలో వినాయక విగ్రహం నిమజ్జనం ఊరేగింపు బండిని లాగుతున్న పొట్టేళ్లు

ప్రత్యేక ఆకర్షణగా పొట్టేళ్ల ప్రభ

అద్దంకి, సెప్టెంబరు16: వినాయక నిమజ్జన ఊరేగింపులు సోమవారం ఉత్సాహంగా సాగాయి. అద్దంకి పట్టణంలోని బంగ్లా రోడ్డు, రామాటాకీస్ బజార్, గొర్లమిట్ట తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను సోమవారం పట్టణంలో ఊరేగింపు నిర్వహించి గుండ్లకమ్మ నదిలో నిమజ్జనం చేశారు. గొర్లమిట్టలో ప్రభ ఏర్పాటు చేసి బండి పై వినాయక విగ్రహం ఉంచి మూడు జతల పొట్టేళ్లతో లాగించారు. పొట్టేళ్ల బండి ప్రభ, వినాయక విగ్రహం ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గొర్లమిట్టలో వినాయక విగ్రహం నిమజ్జనం ఊరేగింపును టీడీపీ బాపట్ల జిల్లా న్యాయవాదుల విభాగం అధ్యక్షుడు బత్తుల రామకోటయ్య ప్రారంభించారు. స్థానిక టీడీపీ నేతలు ఎనుమల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ట్రాక్టర్‌పై ప్రత్యేక ఆకర్షణగా ఎన్టీఆర్ బొమ్మ

మార్టూరు, సెప్టెంబరు 16:మండలంలోని గ్రామాలలో వినాయకుని నిమజ్జనాలను భక్తులు భక్తిపారవశ్యంతో నిర్వహిస్తున్నారు.సోమవారం మార్టూరు తూర్పుబజారులో వినాయకుని గుడి వద్ద మండపంలో ఏర్పాటుచేసిన గణనాథున్ని నిమజ్జనానికి తరలించారు. అందుకోసం భక్తులు ప్రత్యేకంగా రక రకాల పూలతో అలంకరించిన ట్రాక్టరుపై వినాయకుని బొమ్మను ఏర్పాటుచేశారు. అంతేగాకుండా ఈ ట్రాక్టరుపై ముందుభాగాన ఎన్‌టీఆర్ బొమ్మ తోపాటు, ఇరువైపులా ఏర్పాటు చేసిన ఏనుగుల బొమ్మలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అదేవిధంగా స్వామి వారి లడ్డూను 50 వేల రూపాయలకు నార్నె రామాంజనేయులు పాడుకున్నాడు. ఇంకా మార్టూరు నేతాజీనగర్‌లో ఎస్‌సి లు ఏర్పాటుచేసిన వినాయకుడిని డప్పులు వాయిద్యాలతో,బాణసంచా కాలుస్తూ,దేవతామూర్తుల అవతారంలో భక్తులు ఊరేగింపుగా స్వామి వారిని నిమజ్జనానికి తరలించారు.అదేవిధంగా సంపత్ నగర్‌లో బీసీలు ఏర్పాటుచేసిన వినాయకుడ్ని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసి ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు.యద్దనపూడి మండలం పూనూరు గ్రామంలో శివాలయం నుంచి గణనాథుడిని డప్పు వాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపుచేసి నిమజ్జనానికి తరలించారు.


మార్టూరులో తూర్పుబజారున నిమజ్జనానికి ట్రాక్టరుపై బయలుదేరిన వినాయకుని ముందు ప్రత్యేక ఆకర్షణగా ఎన్‌టీఆర్ బొమ్మ

సమస్యలకు నిలయం దివ్యాంగుల కాలనీ

పట్టించుకోవాలని వేడుకోలు

మార్టూరు, సెప్టెంబరు16: జాతీయరహదారి సమీపంలో ఉన్న మా కాలనీలో సమస్యలను అధికారులు పట్టించుకోవాలని మార్టూరులోని దివ్యాంగుల కాలనీ వాసులు కోరుతున్నారు.దాదాపుగా 2008లో 50 మంది దివ్యాంగులకు ఇంటి స్థలాలను ఇచ్చారు. తర్వాత మరి కొంత మందికి ఇచ్చారు.వారిలో కొంతమంది పక్కా ఇళ్లు నిర్మించుకున్నారు. మరి కొంతమందికి ప్రభుత్వ పరంగా సహకారం అందకపోవడంతో ఇంటి నిర్మాణాలను చేపట్టలేకపోయారు. అయితే కాలనీలో ఇంతవరకు కనీస అవసరాలు కూడా ఏర్పాటుచేయలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోలేదని వాపోయారు. కాలనీలో మూడువీధులలో ఇప్పటివరకు విద్యుత్, తాగునీరు, సైడుకాల్వలు, డ్రైనేజీ సౌకర్యం కూడా ఏర్పాటుచేయలేదని,దానికి తోడు రోడ్లుకూడా సక్రమంగా లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని ఉప్పలపాటి అచ్చుతరామరాజు,షేక్ సైదాబి, జి.సాయిబాబు, జంగా బాబు, కోటేశ్వరరావు, సత్యానందం, గోనుగుంట్ల వెంకటసుబ్బారావు తదితరులు కోరుతున్నారు.


రహదారి లేక చిల్లచెట్లతో నిండి ఉన్న కాలనీ గురించి వివరిస్తున్న దివ్యాంగులు, స్థానికులు

రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ

అద్దంకి, సెప్టెంబరు16: రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదినం సందర్భంగా సోమవారం అద్దంకి పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో సిబ్బందికి స్వీట్లు, రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు కాలేషాబాబు విరాట్, కొండ్రగుంట శ్రీనివాసరావు, దేవరపల్లి సురేష్, కొత్తమాసు నాగరాజు, గుర్నాదం వెంకటేశ్వర్లు, నాగులు పాల్గొన్నారు.

నేడు ర్యాలీ

స్వచ్ఛతే సేవ పక్షోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం అద్దంకి పట్టణంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు డీఎం బెల్లం రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రారంభమై బంగ్లా రోడ్డు వరకు జరిగే ర్యాలీలో పలు పాఠశాలల విద్యార్థులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు

సాగర్ కాలువ వద్ద పొంచిఉన్న ప్రమాదం

పంగులూరు, సెప్టెంబరు 16 :మండలంలోని అలవలపాడు అడ్డరోడ్డు మలుపులో ఉన్న సాగర్ నీటి కాలువతో ప్రమాదం పొంచిఉంది. 16వ నెంబరు జాతీయ రహదారికి పడమటి వైపున ఉన్న పమిడిపాడు మేజర్ నుంచి అలవలపాడు పంట పొలాలకు, సాగు నీటి చెరువుకు నీటి సరఫరా చేసేందుకు ఎస్ఎస్‌పీ కాలువ నిర్మితమై ఉంది. జాతీయరహదారికి పడమటి వైపున ఉన్న ప్రధాన కాలువ నుంచి రోడ్డు ఇవతలవైపుకు నీటి సరఫరా కోసం రోడ్డు అడుగున తూములు ఏర్పాటు చేసి కాలువపై గోడ నిర్మించారు. జాతీయరహదారికి తూర్పున అలవలపాడు వైపు అడ్డరోడ్డుకు తిరిగే మలుపులో కాలువపై నిర్మితమైన రక్షణ గోడ రోడ్డుకు సమాంతరంగా ఉండటంతో ప్రమాదం పొంచి ఉంది. రేణంగివరం నుంచి అలవలపాడు వైపు వెళ్లే ఈ రోడ్డు మలుపులో కాలువపై రోడ్డుకు సమాంతరంగా ఉన్న రక్షణ గోడ ఎత్తు పెంచి ప్రమాదాలు నివారించేలా చర్యలు చేపట్టాలని వాహనచోదకులు సంబంధిత అధికారులను వేడుకుంటున్నారు.


అలవలపాడు అడ్డరోడ్డు మలుపులో ప్రమాదకరంగా ఉన్న సాగర్ కాలువ

పవర్‌లిఫ్టింగ్‌లో చాంపియన్‌గా కుమారి నంద


అవార్డు అందుకుంటున్న కుమారి నంద

సంతమాగులూరు, సెప్టెంబరు 16:స్టేట్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌గా ఏల్చూరు గ్రామానికి చెందిన మహిళా న్యాయవాది కుమారి నంద ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ నెల 14, 15 తేదీలలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలో జరిగిన 11వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అన్ ఎక్యూపుడ్ పవర్ లిఫ్టింగ్ బెంచ్ ప్రెస్ చాంపియన్ షిప్-2024 పోటీలలో ఏల్చూరు గ్రామానికి చెందిన మహిళా న్యాయవాది పర్చూరు కుమారి నంద 2 పతకాలు సాధించారు. కుమారి నంద సీనియర్స్ మహిళల విభాగంలో బాపట్ల జిల్లా తరఫున 76 కేజీల విభాగంలో పోటీపడి బెంచ్ ప్రెస్‌లో గోల్డ్ మెడల్ సాధించి స్టేట్ చాంపియన్‌గా నిలిచారు. అంతే కాకుండా అన్ ఎక్యూపుడ్ పవర్ లిఫ్టింగ్ విభాగంలో 265 కేజీల బరువును ఎత్తి మరొక రజిత పతకాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఇప్పటికే బాపట్ల జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్‌కి వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ వృత్తి రీత్యా న్యాయవాదిగా సేవలందిస్తూనే కుమారి నంద పవర్ లిఫ్టింగ్ క్రీడపై మక్కువతో పోటీలలో పాల్గొంటూ పతకాలు సాధించడం పట్ల ఆమె తల్లిదండ్రులు, ఏల్చూరు గ్రామస్థులు, బాపట్ల జిల్లా క్రీడాభిమానులు అభినందనలు తెలియజేశారు.

సాయి వాసవికి ఆంధ్ర మెడికల్ కాలేజీలో సీటు



చినగంజాం, సెప్టెంబరు 16 : మండలంలోని కడవకుదురు గ్రామానికి చెందిన మాదాసు సాయివాసవి విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. మేలో జరిగిన నీట్-2024లో 720 మార్కులకు గాను 662 మార్కులు సాధించి, ఆల్ ఇండియాలో 17541వ ర్యాంకు సాధించింది. జూన్ మొదటి వారం ఫలితాలు రాగా ఆదివారం రాత్రి ప్రభుత్వ ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు కేటాయించినట్లు సమాచారం వచ్చిందని సాయివాసవి సోమవారం తెలిపారు. సాయివాసవి తండ్రి నరసింహారావు అద్దంకి ఆర్టీసీ డిపోలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. తల్లి వైదేహి గృహిణి. మెడికల్ సీటు సాధించిన సాయివాసవికి గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

బాడీ బిల్డింగ్‌లో చీరాల యువకుల సత్తా

చీరాలటౌన్, సెప్టెంబర్ 16 : బాడీ బిల్డింగ్‌లో విజేతలుగా చీరాల యువకులు నిలిచారు. గత ఆదివారం ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 55 కేజీల విభాగంలో చీరాల మండలం పాత చీరాలకు చెందిన సూరిన భాస్కర రెడ్డి రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. 50 కేజీల విభాగంలో అదే గ్రామానికి చెందిన మేరుగు కిషోర్ 4వ స్థానాన్ని దక్కించుకున్నారు. దీంతో రాష్ట్రస్థాయిలో చీరాల ఘనతను చాటిన వీరిని పలువురు అభినందించారు.


రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు, నాలుగు స్థానాలు సాధించిన యువకులు

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ మెకానిక్ దుర్మరణం


భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య (ఇన్‌సెట్లో) ఫణికుమార్ (ఫైల్)

చీరాలటౌన్, సెప్టెంబర్ 16 : రోడ్డుప్రమాదంలో ఆర్టీసీ గ్యారేజి రెగ్యులర్ మెకానిక్ దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జాండ్రపేట సమీపంలోని గుమస్తాల కాలనీకిచెందిన అచ్యుతుని ఫణికుమార్(43) చీరాల ఆర్టీసీ డిపోలో రెగ్యులర్ మెకానిక్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఇతనికి భార్య, ఏడేళ్ల బాబు ఉన్నారు. సోమవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లి తిరిగి ఇంటికి పాల ప్యాకెట్ తీసుకుని వస్తుండగా వేటపాలెం నుంచి చీరాల వైపు బైక్‌పై వెళుతున్న ఇద్దరు యువకులు వేగంగా వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో ఫణి రోడ్డుపక్కన డివైడర్‌ను గుద్దుకుని అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే వారు అదే వేగంతో ఆగి ఉన్న ఆటోను సైతం ఢీకొట్టగా ఆటో దాదాపు 10మీటర్లు ముందుకు వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు చీరాల సీపీఐ సీనియర్ నాయకులు బాబురావు రెండవ కుమారుడు.

వృద్ధులకు పండ్లు, మిఠాయిల పంపిణీ


పర్చూరులో అన్నదానం నిర్వహిస్తున్న జనసైనికులు

పర్చూరు, సెప్టెంబరు 16: జనసేన పార్టీ పర్చూరు నియోజకవర్గ నాయకులు మన్నెం శ్రీకాంత్ జన్మదినం సందర్భంగా పర్చూరులోని వృద్ధాశ్రమంలో ఆదివారం వృద్ధులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక బొమ్మల సెంటర్ కూడలిలో భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. సామాజిక సేవే లక్ష్యంగా తమ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా కార్యక్రమం చేపట్టినట్లు ఆపార్టీ నాయకులు కారంపూడి సందీప్ తేజ, తోట మణి, రంగిశెట్టి ఆంజనేయులు, దాసరి సాంబయ్య, బాలు, అచ్చికోలు సతీష్ తదితరులు పాల్గొన్నారు. దీనికి ముందుకు కేక్ కట్‌చేసి శ్రీకాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

చినగంజాం, సెప్టెంబరు 16 : మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకొని మిలాద్-ఉన్-నబీ పండుగను భక్తి శ్రద్ధలతో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త చూపిన శాంతి, ధర్మం, న్యాయం, అహింసా మార్గాల్లో ప్రజలు నడవాలని ముస్లిం పెద్దలు సూచించారు. ఈ సందర్భంగా చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని జాలమ్మ కాలనీలోని పేద పిల్లలకు చినగంజాం రెండవ వార్డు మెంబరు, మండల మార్కెట్ మసీదు అధ్యక్షులు షేక్.నబీషా, ఆయన కుమార్తె అయిషాలు దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు.

పర్చూరులో..

పర్చూరు : మిలాదున్ నబి పండుగను మండలంలోని ముస్లిం సోదరులు సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మహ్మద్ ప్రవక్త మార్గాన్ని అనుసరించి జీవనం సాగించాలని ఇమామ్ కోరారు.

ముస్లింలకు మంత్రి శుభాకాంక్షలు

అద్దంకి, సెప్టెంబరు16: సమాజాన్ని శాంతి వైపు నడిపించిన దివ్యచరితుడు మహమ్మద్ ప్రవక్త అని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినం మిలాద్-ఉన్-నబిని ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్న ముస్లింలకు రవికుమార్ ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.